

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శుక్రవారం 01-08-2025 | సంపుటి - 24 | సంచిక - 87 | రూ : 4 | పేజీలు:


# ప్రపంచంలో అత్యధిక వలసదారులు భారత్ నుంచే

## : ఐక్యరాజ్యసమితి



- 2024 నాటికి వరల్డ్‌వైడ్‌గా 1.85 కోట్ల మంది ప్రవాస భారతీయులు
- ఇది ప్రపంచ వలసదారుల్లో 6 శాతం అన్న ఐక్యరాజ్యసమితి
- ప్రపంచవ్యాప్తంగా 30.4 కోట్ల మంది అంతర్జాతీయ వలసదారులు
- 2020లో ఈ సంఖ్య 27.5 కోట్లుగా ఉన్నట్లు వెల్లడి
- అత్యధికంగా యూఏఈలో 32.5 లక్షల మంది భారతీయులు

ప్రపంచవ్యాప్తంగా ఉన్న వలసదారుల్లో అత్యధికం భారతీయులే అని ఐక్యరాజ్యసమితి వెల్లడించింది. 2024 నాటికి వరల్డ్‌వైడ్‌గా 1.85 కోట్ల మంది ప్రవాస భారతీయులు ఉన్నట్టు, ఇది ప్రపంచ వలసదారుల్లో 6 శాతం అని పేర్కొంది. ఇక, ప్రపంచవ్యాప్తంగా 30.4 కోట్ల మంది అంతర్జాతీయ వలసదారులు ఉన్నారని తెలిపింది. 2020లో ఈ సంఖ్య 27.5 కోట్లుగా ఉన్నట్లు వెల్లడించింది. అంతర్జాతీయ వలసల్లో 1.85 కోట్ల మంది ప్రవాసులతో భారత్ అగ్రస్థానంలో ఉంటే.. ఆ తర్వాత చైనా (1.17 కోట్లు), మెక్సికో (1.16 కోట్లు), ఉక్రెయిన్ (98 లక్షలు),

తరువాయి 2లో



## త్వరలో వారణాసిలో అర్బన్ రోప్ వే ప్రారంభం...

## హైదరాబాద్ సంస్థ ఘనత!

- దేశంలో మొట్ట మొదటి అర్బన్ రోప్ వే వారాణాసిలో పూర్తి
- ఆగస్టులో ప్రారంభం కానున్న వైనం!
- రోప్ వే నిర్మాణ పనులు పూర్తి చేసిన హైదరాబాద్‌కు చెందిన విశ్వ సముద్ర ఇంజినీరింగ్ సంస్థ

భారతదేశంలోనే మొట్టమొదటి అర్బన్ రోప్‌వే ప్రాజెక్ట్‌గా వారణాసి రోప్‌వే త్వరలో ప్రారంభోత్సవానికి సిద్ధమవుతోంది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి. మార్చి నెల నుంచే రోప్‌వే టెస్ట్ రన్‌లు విజయవంతంగా

తరువాయి 2లో

## ఆ పెట్టెల లెక్క జగన్ కే బాగా తెలుసు!...

## లిక్కర్ స్కాంపై నారా లోకేశ్ ఆసక్తికర వ్యాఖ్యలు

### సచివాలయంలో నారా లోకేశ్ ప్రెస్ మీట్



- హైదరాబాదులో నగదు పట్టుబడడంపై స్పందన
- ఎంత మొత్తం చేతులు మారిందో తెలుసుకోవాలంటే జగన్‌ను అడగాలని వ్యాఖ్యలు

లిక్కర్ కుంభకోణంపై వస్తున్న ఆరోపణలకు సంబంధించి, ఏ పెట్టెలో ఎంత డబ్బు చేరుతుందో జగన్‌కే బాగా తెలుసని మంత్రి నారా లోకేశ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్ శివార్లలోని ఓ ఫాంహౌస్ లో పెద్దఎత్తున డబ్బు పట్టుబడటంపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు స్పందిస్తూ, ఈ కుంభకోణంలో ఎంత మొత్తం చేతులు మారిందో తెలుసుకోవాలంటే జగన్‌ను అడగాలని లోకేశ్ ఎద్దేవా చేశారు. లోకేశ్ మాట్లాడుతూ, "దేశంలో ఎక్కడైనా లిక్కర్ కంపెనీ రూ. 400

తరువాయి 2లో



## గుజరాత్‌లో స్వల్ప భూకంపం..

- రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రత 3.3గా నమోదు
- కచ్ జిల్లాలోని బేలాకు నైరుతి దిశలో 16 కి.మీ. దూరంలో భూకంప కేంద్రం
- ఈ భూకంపం వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదన్న అధికారులు

గుజరాత్‌లోని కచ్ జిల్లాలో గురువారం ఉదయం స్వల్ప భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రత 3.3గా నమోదైనట్లు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిస్మాలాజికల్ రీసెర్చ్ (ఐఎస్ఆర్) వెల్లడించింది. భూకంపం ఉదయం 9.52 గంటల ప్రాంతంలో సంభవించిందని తెలిపింది. కచ్ జిల్లాలోని బేలాకు నైరుతి దిశలో 16

తరువాయి 2లో

## పార్టీ మారిన ఎమ్మెల్యేలపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు..

## ముఖ్య నేతలతో కేసీఆర్ సమావేశం

### ఎర్రవెల్లిలోని తన నివాసంలో సమావేశమైన మాజీ ముఖ్యమంత్రి



- మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశాలు
- సత్యమేవ జయతే అంటూ బీఆర్ఎస్ ట్వీట్

తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రవెల్లిలోని తన నివాసంలో పార్టీ ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పార్టీ ముఖ్య నాయకులు కేటీఆర్, హరీశ్ రావు, జగదీశ్ రెడ్డి తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రవెల్లిలోని తన నివాసంలో పార్టీ ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పార్టీ ముఖ్య నాయకులు కేటీఆర్, హరీశ్ రావు, జగదీశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌లపై

తరువాయి 2లో

## పాకిస్థాన్‌కు భారత్ ఝలక్..

## చీనాబ్ నదిపై సావల్‌కోట్ ప్రాజెక్టు!



- సింధూ జలాల ఒప్పందం అమలు నిలిపివేత
- జమ్మూకశ్మీర్‌లో కీలక ప్రాజెక్టులపై కేంద్రం దృష్టి
- సావల్‌కోట్ జలవిద్యుత్ ప్రాజెక్టు పునరుద్ధరణకు చర్యలు

2లో

## జగన్ పర్యటనలో తొక్కిసలాట..

## కానిస్టేబుల్ మాలకొండయ్యకు గాయాలు

2లో



# ప్రపంచంలో అత్యధిక వలసదారులు భారత్ నుంచే: ఐక్యరాజ్యసమితి

(మొదటిపేజీ తరువాయి)

రష్యా (91 లక్షలు) ఉన్నాయి. అత్యధిక భారతీయ డయాస్పోరా ఉన్న దేశాలు ఒకప్పుడు సౌదీ అరేబియా, పాకిస్థాన్ దేశాలకే పరిమితమైన భారతీయ వలస సముదాయం ఇప్పుడు పశ్చిమ దేశాలకు బదిలీ అయింది. పశ్చిమాసియాలోని ఇండియన్ డయాస్పోరాను తీసుకుంటే యూఏఈలోని మొత్తం జనాభాలో 40 శాతం భారతీయ వలసదారులే ఉన్నారు. ఇక, అమెరికాలో ఇండో అమెరికన్లు రెండో అతిపెద్ద ఆసియన్ గ్రూప్‌గా ఉన్నారు. మొదటి స్థానంలో చైనీస్ అమెరికన్లు ఉన్నారు. యూఏఈలో 32.5 లక్షల మంది భారతీయులు ఉంటే.. అమెరికాలో 31.7లక్షలు, సౌదీ అరేబియాలో 19.5 లక్షలు, కెనడాలో 10.2 లక్షల మంది ఉన్నారు. అలాగే ఐక్యరాజ్యసమితి డేటా ప్రకారం, పెద్ద సంఖ్యలో భారతీయ వలసదారులకు ఆతిథ్యం ఇస్తున్న ఇతర దేశాలలో ఆస్ట్రేలియా, కువైట్, ఒమన్, పాకిస్థాన్, ఖతార్, బహ్రెయిన్, మలేషియా, యూకే ఉన్నాయి.

# త్వరలో వారణాసిలో అర్బన్ రోప్ వే ప్రారంభం... హైదరాబాద్ సంస్థ ఘనత!

(మొదటిపేజీ తరువాయి)



జరుగుతున్నాయి. ఈ రోప్‌వే ప్రాజెక్టు ఆగస్టు నుంచి ప్రజలకు అందుబాటులోకి రానున్నట్టు తెలుస్తోంది. ఈ ప్రాజెక్టులో ఓ తెలుగు సంస్థ పనితనం ఉండడం విశేషం.

**ప్రాజెక్ట్ వివరాలు**

నేషనల్ హైవే లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ (NHLMCL) ఈ ప్రాజెక్ట్‌ను నిర్వహిస్తోంది. హైదరాబాద్‌కు చెందిన విశ్వ సముద్ర ఇంజినీరింగ్ సంస్థ నిర్మాణ పనులను విజయవంతంగా పూర్తి చేసింది. ఈ ప్రాజెక్టు మొత్తం వ్యయం దాదాపు రూ.815 కోట్లు. 2023 మార్చిలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఈ భారీ ప్రాజెక్టుకు శంకుస్థాపన జరిగింది.

**ప్రత్యేకతలు**

ఈ రోప్‌వే ప్రాజెక్టు ద్వారా నగరంలో ప్రజా రవాణా మరింత సులభతరం కానుంది. ముఖ్యంగా ట్రాఫిక్ సమస్యలకు ఇది సులభమైన పరిష్కారం. ప్రయాణ సమయం: గోడౌలియా నుండి కాంట్ రైల్వే స్టేషన్‌కు కేవలం 16 నిమిషాల్లో చేరుకోవచ్చు. ఈ ప్రాజెక్టులో భాగంగా 150 గోండోలాలు 4550 మీటర్ల ఎత్తులో నడుస్తాయి. ఒక్కో గోండోలాలో గరిష్ఠంగా 10 మంది ప్రయాణించే వీలుంటుంది. గంటకు 3 వేల మందిని రవాణా చేయగల సామర్థ్యంతో ఈ ప్రాజెక్టును నిర్మించారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన వారణాసికి నిత్యం వేలాదిగా భక్తులు తరలివస్తుంటారు. వారణాసిలో రద్దీని తగ్గించి, యాత్రికులు, పర్యాటకులకు సౌకర్యవంతమైన మరియు పర్యావరణ అనుకూల రవాణా సౌకర్యాన్ని అందించడమే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశ్యం. ఈ రోప్‌వే ప్రారంభంతో వారణాసికి వచ్చే భక్తులకు, పర్యాటకులకు మెరుగైన ప్రయాణ అనుభవం లభిస్తుందని ఆశిస్తున్నారు.

# గుజరాత్‌లో స్వల్ప భూకంపం

(మొదటిపేజీ తరువాయి)

దూరంలో భూకంప కేంద్రం కేంద్రీకృతమైనట్లు ఐఎస్ఆర్ పేర్కొంది. ఈ స్వల్ప భూకంపం వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదని జిల్లా విపత్తుల నిర్వహణ అధికారి వెల్లడించారు. కచ్ జిల్లా భూకంపానికి వెరీ హై రిస్క్ జోన్ అని పేర్కొన్నారు. తక్కువ ప్రకంపనలతో ఇక్కడ తరుచుగా భూంకపాలు సంభవిస్తాయన్నారు. కాగా, 2001లో సంభవించిన భూకంపం వల్ల కచ్‌లో 13,800 మందికి పైగా చనిపోయిన విషయం తెలిసిందే. అలాగే 1.67 లక్షల మంది గాయపడ్డారు.

# స్టాలిన్‌తో మార్నింగ్ వాక్.. ఎన్డీయేకు పన్నీర్ సెల్వం గుడ్‌బై

చెన్నై: తమిళ రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. మాజీ ముఖ్యమంత్రి పన్నీర్ సెల్వం ఎన్డీయే నుంచి వైదొలగారు. ఈ మేరకు మాజీ మంత్రి, సెల్వంకు నమ్మినబంటు రామచంద్రన్ ప్రకటించారు. ఆయన ప్రకటిస్తున్న సమయంలో సెల్వం కూడా అక్కడే ఉన్నారు. మార్నింగ్ వాక్ సమయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను పన్నీర్ సెల్వం కలిశారు. పలు విషయాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఎన్డీయే నుంచి వైదొలగుతున్నట్లు ప్రకటించడం గమనార్హం. ఎన్డీయే కూటమితో పూర్తిగా సంబంధాలు తెంచుకున్నట్లు ఆ ప్రకటనలో తెలిపారు. 2026 అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పన్నీర్ సెల్వం రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించనున్నట్లు పేర్కొన్నారు. పొత్తుల గురించి ఇప్పుడు ప్రస్తావించాల్సిన సమయం కాదని, ఎన్నికల ముంగిట ఆ అంశం గురించి మాట్లాడతామని అన్నారు. మరోవైపు ఇటీవల సినీనటుడు విజయ్ ప్రారంభించిన తమిళ వెట్రి కళగ (టీవీకే)తో ఓపీఎస్ చేతులు కలిపే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పన్నీర్ సెల్వాన్ని విలేకరులు పొత్తుల అంశం గురించి ప్రస్తావించగా.. కాలమే చెబుతుంది అంటూ.. సమాధానం దాటవేశారు. పన్నీర్ సెల్వం ఒకానొక సమయంలో ఏఐఏడీఎంకేలో కీలకంగా వ్యవహరించారు. ఎన్డీయే కూటమిలోనూ ముఖ్యపాత్ర పోషించారు. అయితే, పార్టీలో ఏర్పడిన అంతర్గత కలహాలతో బహిష్కరణకు గురైన ఆయన.. సొంతంగా తన వర్గాన్ని విస్తరించుకున్నారు. తాజాగా ఎన్డీయే నుంచి కూడా బయటకు రావడం.. 2026 అసెంబ్లీ ఎన్నికల ముంగిట తమిళ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది.

# ఎన్‌సీడీసీకి రూ.2వేల కోట్ల ఆర్థిక సాయం కేంద్ర క్యాబినెట్ నిర్ణయం

నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు రూ.2 వేల కోట్లు ఆర్థిక సాయాన్ని ఇచ్చేందుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. గ్రాంట్ ఇన్‌ఎయిడ్ కింద నాలుగేళ్లపాటు దీన్ని అందించనుంది. రుణాల కింద మరిన్ని నిధులు సమకూర్చుకోవడానికి తాజా చర్య ఉపయోగపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ప్రధానమంత్రి మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. దేశంలో 8.25లక్షలకు పైగా ఉన్న సహకార సంఘాల్లోని 29 కోట్ల మంది సభ్యులకు ఈ కార్పొరేషన్ రుణాలు అందిస్తుంది. వీరిలో 94శాతం మంది రైతులే ఉన్నారు. కేంద్రం అందించే ఈ ఆర్థిక సాయం ద్వారా అదనంగా మరో రూ.20వేల కోట్ల రుణాలను ఎన్‌సీడీసీ సమకూర్చుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం ఎన్‌సీడీసీ రుణ రికవరీ రేటు 99.8శాతంగా ఉండగా.. సున్నా ఎన్‌పీఏ ఉన్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు.

## ఆ పెట్టెల లెక్క జగన్ కే బాగా తెలుసు!

# లిక్కర్ స్కాంపై నారా లోకేశ్ ఆసక్తికర వ్యాఖ్యలు

(మొదటిపేజీ తరువాయి)

కోట్ల బంగారం కొంటుందా? లిక్కర్ బంగారంతో తయారు చేస్తారా?" అని ప్రశ్నించారు. అవినీతి సొమ్ముతో అద్భుతమైన పెట్టుబడులు పెట్టవచ్చని వీరు నిరూపించారని, ఇది రాజకీయాల్లో నేరమయతత్వానికి గొప్ప ఉదాహరణ అని విమర్శించారు. అదాన్ డిస్టిలరీ నుంచి పీఎల్ఆర్ కంపెనీకి డబ్బు బదిలీ అయిందని, అక్కడి నుంచి జగన్‌కు చేరిందని లోకేశ్ స్పష్టం చేశారు. పీఎల్ఆర్ సంస్థ అవినీతి కంపెనీ అని, లిక్కర్ కంపెనీ నుంచి పీఎల్ఆర్ కు ఎందుకు డబ్బు వెళ్లిందో సూటిగా ప్రశ్నిస్తున్నానని లోకేశ్ డిమాండ్ చేశారు. తమ అకౌంట్ కు డబ్బు వచ్చిన మాట నిజం కాదని పెద్దిరెడ్డి చెప్పగలరా అని ఆయన సవాల్ విసిరారు. గత ప్రభుత్వ హయాంలో అమాయకుల ప్రాణాలను బలిగొన్న కల్తీ మద్యంపై కూటమి పోరాడిందని, ఇప్పుడు పారదర్శకమైన పాలసీని తీసుకొచ్చామని లోకేశ్ తెలిపారు.

* **"జగన్ బయట తిరుగుతున్నారంటే ఎమర్జెన్సీ లేదనే అర్థం!"**

రాష్ట్రంలో ఎమర్జెన్సీ పరిస్థితులు ఉన్నాయన్న జగన్ వ్యాఖ్యలను లోకేశ్ తీవ్రంగా ఖండించారు. "అటువంటి పరిస్థితులే ఉంటే జగన్ బయట తిరిగే వారా? స్వేచ్ఛగా హెలికాప్టర్‌లో తిరుగుతున్నారు, ఆయనకు పూర్తిస్థాయిలో భద్రత కల్పిస్తున్నాం" అని లోకేశ్ పేర్కొన్నారు. నెల్లూరులో జగన్ పర్యటించే ప్రాంతంలో జరుగుతున్న నిర్మాణ పనుల వల్ల మట్టి తొలగించబడిందని, దాన్ని తమపై



రుద్దవద్దని ఆయన స్పష్టం చేశారు. అనంతపురం పర్యటన సందర్భంగా వైసీపీ కార్యకర్తలు హెలికాప్టర్ అద్దాన్ని పగలగొట్టడం వల్ల రూ. 16 లక్షల నష్టం వచ్చిందని అద్దెకు ఇచ్చిన సంస్థ వాపోయిందని లోకేశ్ గుర్తు చేశారు. మాజీ ముఖ్యమంత్రి బయటకు వెళితే 3,000 మంది పోలీసులను వినియోగిస్తున్నామని, ముఖ్యమంత్రికి కూడా అంత భద్రత ఉండదని లోకేశ్ వివరించారు. ఈరోజు నెల్లూరు పర్యటనలో కూడా వైసీపీ కార్యకర్తలు పోలీసులను కొట్టారని, పోలీసులు లేకుండా చేస్తే జగన్ ఎక్కడికైనా వెళ్లగలరా అని ఆయన ప్రశ్నించారు. తమ ప్రభుత్వం జగన్ మాదిరిగా సొంత కార్యకర్తలను చంపలేదని లోకేశ్ అన్నారు. తల్లిపైన కేసు గెలిచాక సంబరాలు చేసుకున్న ఏకైక కొడుకు జగన్ మాత్రమే అని, తల్లి, చెల్లిపైనా ఎవరైనా కేసు పెడతారా అని లోకేశ్ మండిపడ్డారు. 2021లో వారికి ఇచ్చిన గిఫ్ట్ డీడ్‌ను లాగేసుకున్న నాయకుడు జగన్ అని, తల్లికి, చెల్లికి న్యాయం చేయలేనివాడు రాష్ట్రంలోని మహిళలకు ఏం న్యాయం చేస్తారని లోకేశ్ దుయ్యబట్టారు. రాజ్యాంగం అందరికీ తిరిగే స్వేచ్ఛను ఇచ్చిందని, అంబేద్కర్ రాజ్యాంగాన్ని తాము అమలుచేస్తున్నామని లోకేశ్ పునరుద్ఘాటించారు. జగన్ పర్యటనకు వెళ్లినపుడు పోలీసులు జనాలను క్రమబద్ధీకరిస్తున్నారని, ఆయనపై జనం పడితే మళ్లీ తమకు భద్రత ఇవ్వలేదని చెబుతారని అన్నారు. మందు, డబ్బు ఇచ్చి జనాలను వారి కార్యక్రమాలకు తోలుతున్నారని ఆయన ఆరోపించారు. గతంలో సత్తెనపల్లి పర్యటన సందర్భంగా జగన్ కారు కిందపడి ఒక వ్యక్తి చనిపోయారని, ఒకరు గుండెపోటుతో మరణించారని, అంబులెన్స్‌లో చిక్కుకొని మరొకరు చనిపోయారని లోకేశ్ గుర్తు చేశారు. అటువంటివి జరగకుండా క్రమబద్ధీకరిస్తే తప్పు ప్రభుత్వానిది అంటారని ఆయన విమర్శించారు. జగన్ లా తాము గేట్లకు తాళ్లు కట్టడం లేదని, చంద్రబాబు ఇంటి చుట్టూ 144వ సెక్షన్ అమలు చేసినట్టుగా తాము చేయడం లేదని లోకేశ్ స్పష్టం చేశారు.

# పార్టీ మారిన ఎమ్మెల్యేలపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు..

## ముఖ్య నేతలతో కేసీఆర్ సమావేశం

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రవెల్లిలోని తన నివాసంలో పార్టీ ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పార్టీ ముఖ్య నాయకులు కేటీఆర్, హరీశ్ రావు, జగదీశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌లపై మూడు నెలల్లోపు స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది.

**సత్యమేవ జయతే అంటూ బీఆర్ఎస్ ట్వీట్**

పార్టీ మారిన ఎమ్మెల్యేలపై స్పీకర్ మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో బీఆర్ఎస్ 'ఎక్స్' వేదికగా స్పందించింది. సత్యమేవ జయతే అంటూ ట్వీట్ చేసింది. తెలంగాణలో ఉప ఎన్నికలు అనివార్యం కానున్నాయని పేర్కొంది.

# పాకిస్థాన్‌కు భారత్ ఝలక్.. చీనాబ్ నదిపై సావల్‌కోట్ ప్రాజెక్టు!

చీనాబ్ నదిపై గతంలో నిలిపివేసిన సావల్‌కోట్ జలవిద్యుత్ ప్రాజెక్టును పునఃప్రారంభించడం ద్వారా పాకిస్థాన్‌కు భారత్ అడ్డుకట్ట వేయనుంది. పహల్గామ్ ఉగ్రదాడి, తదనంతర పరిణామాల నేపథ్యంలో సింధూ జలాల ఒప్పందం అమలును నిలిపివేసిన తర్వాత భారత్ జమ్ముకశ్మీర్‌లో పలు కీలక ప్రాజెక్టులపై దృష్టి సారించింది. ఈ క్రమంలో ఈ భారీ విద్యుత్ ప్రాజెక్టు పునరుద్ధరణకు సిద్ధమవుతోంది. చీనాబ్ నదిపై గతంలో నిలిపివేసిన సావల్‌కోట్ జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మించేందుకు కేంద్రం చర్యలు చేపట్టింది. ఈ మేరకు నేషనల్ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ ఇటీవల అంతర్జాతీయ టెండర్లను ఆహ్వానించింది. ఇదివరకే తుల్‌బుల్ ప్రాజెక్టు పునరుద్ధరణ చర్యలు చేపట్టింది. చీనాబ్ నదిపై సావల్‌కోట్ జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మించాలనే ప్రతిపాదన 1980ల నుంచే ఉంది. పాకిస్థాన్ అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో దాదాపు నాలుగు దశాబ్దాలుగా ఈ ప్రాజెక్టు నిలిచిపోయింది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం సింధూ జలాల ఒప్పందం అమలును నిలిపివేయడం, ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ఎటువంటి అడ్డంకులు లేకపోవడంతో ప్రభుత్వం దీనిపై దృష్టి సారించింది. 1,856 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఈ ప్రాజెక్టు నిర్మాణానికి దాదాపు రూ. 22 వేల కోట్లు అవుతుందని అంచనా. దీనిని రెండు దశల్లో నిర్మించనున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్టు కోసం అంతర్జాతీయ బిడ్డింగ్‌కు ఉన్న అడ్డంకులను తొలగించేందుకు కేంద్రం చర్యలు చేపట్టింది. చివరగా పర్యావరణ మంత్రిత్వ శాఖ నుంచి అనుమతులు కూడా రావడంతో ప్రాజెక్టు నిర్మాణానికి మార్గం సుగమమైనట్లు తెలుస్తోంది.

# 10 నియోజకవర్గాల్లో ఉప ఎన్నికకు మూడు నెలల సమయం ఉంది... సిద్ధంకండి

* **కేటీఆర్ పిలుపు**
* **సుప్రీంకోర్టు తీర్పును స్వాగతించిన కేటీఆర్**
* **తన తీర్పు ద్వారా సుప్రీంకోర్టు ప్రజాస్వామ్యాన్ని కాపాడిందన్న కేటీఆర్**
* **పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో మరింత విచారణ అవసరం లేదన్న కేటీఆర్**

పార్టీ ఫిరాయింపులపై సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఈ తీర్పును బీఆర్ఎస్ పార్టీ స్వాగతిస్తుందని ఆయన అన్నారు. పది నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలకు మూడు నెలల సమయం ఉందని, పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ తీర్పు ద్వారా సుప్రీంకోర్టు



ప్రజాస్వామ్యాన్ని కాపాడిందని ఆయన పేర్కొన్నారు. సీజేఐకి ఆయన ధన్యవాదాలు తెలిపారు. కొంతమంది ప్రజాప్రతినిధులు అడ్డదారులు తొక్కినంత మాత్రాన భారతదేశ ప్రజాస్వామిక వ్యవస్థ నాశనం కాదని సుప్రీంకోర్టు తీర్పు నిరూపించిందని కేటీఆర్ అన్నారు. గత ఎన్నికల సందర్భంగా పార్టీ మారితే ఆటోమేటిక్‌గా అనర్హత వర్తించాలని చెప్పిన రాహుల్ గాంధీ, సుప్రీంకోర్టు తీర్పుని స్వాగతిస్తారని ఆశిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. రాహుల్ గాంధీ తాను చెప్పే మాటలకి, నీతినియమాలకు కట్టుబడి ఉండాలని సూచించారు. దమ్ముంటే, నిజాయతీ ఉంటే అనర్హత వేటు విషయంలో 'పాంచ్ న్యాయ్' పేరుతో చెప్పిన నీతులను ఆచరణలో చూపించాలని రాహుల్ గాంధీకి సవాల్ విసిరారు. రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ స్పీకర్ అధికారాలను అడ్డం పెట్టుకొని భారత రాజ్యాంగాన్ని ఇకపై అవహేళన చేయబోరని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ మారిన పది మంది ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయంలో మరింత విచారణ అవసరం లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారిక కార్యక్రమాల్లో ప్రతిరోజు పాల్గొంటున్న ఈ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై వెంటనే అనర్హత వేటు వేస్తూ నిర్ణయం తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ తరఫున సుప్రీంకోర్టులో వాదించిన న్యాయ బృందానికి కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ తరపున ఎన్నికైన పది మంది ఎమ్మెల్యేలు ప్రలోభాలకు లొంగి పార్టీ మారినా, కష్టకాలంలో పార్టీ వెంట నిలిచిన లక్షలాది మంది కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అంతిమంగా సత్యం, ధర్మం గెలిచాయని ఆయన పేర్కొన్నారు.

# జగన్ పర్యటనలో తొక్కిసలాట.. కానిస్టేబుల్ మాలకొండయ్యకు గాయాలు

* **నేడు నెల్లూరు వచ్చిన జగన్**
* **నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డికి పరామర్శ**
* **జగన్ రాకతో ఒక్కసారిగా తోసుకువచ్చిన కార్యకర్తలు**

వైసీపీ అధినేత జగన్ ఇవాళ నెల్లూరు పర్యటనకు రావడం తెలిసిందే. ఆయన వైసీపీ మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిని పరామర్శించేందుకు వెళ్లే క్రమంలో భారీ తోపులాట జరిగింది. ఈ ఘటనలో మాలకొండయ్య అనే కానిస్టేబుల్ గాయపడ్డారు. ఆయనకు చేయి విరిగినట్టు తెలిసిందే. దాంతో ఆయనను ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో ఓ సీఐ కూడా కిందపడిపోయారు. జగన్... ప్రసన్నకుమార్ రెడ్డి ఇంటికి వెళుతున్న సమయంలో వైసీపీ కార్యకర్తలు ఒక్కసారిగా మెయిన్ రోడ్డుపైకి




చేరుకున్నారు. పోలీసులు బారికేడ్లు పెట్టినా, ప్రయోజనం లేకపోయింది. వైసీపీ కార్యకర్తలు అలాగే ముందుకు తోసుకురావడంతో తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనపై ఏపీ హోంమంత్రి అనిత్ ఇప్పటికే ఆరా తీశారు. శాంతిభద్రతలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

# సింగల్ యూస్ ప్లాస్టిక్ నివారణకు సీఎం తీసుకున్న నిర్ణయంపై కృతజ్ఞతలు

జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : సింగల్ యూస్ ప్లాస్టిక్ నివారించడానికి ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయానికి పర్యావరణ ప్రేమికుడు కోల రవీందర్ ముదిరాజ్ కృతజ్ఞతలు తెలియజేశారు. గురువారం సూరారంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సింగల్ యూస్ ప్లాస్టిక్ నివారణపై ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో హైదరాబాదులో విచ్చలవిడిగా నాణ్యతలేని కవర్లు వాడడం తో అట్టి కవర్లు, ఇస్తరాకులు మోరీల్లో డ్రైనేజీల్లో నుండి హైదరాబాద్ వర్షం వచ్చినప్పుడు మునిగిపోతుందన్నారు. సింగల్ యూస్ ప్లాస్టిక్ నివారించడానికి నిర్ణయం తీసుకున్నందుకు గోమాత, జలమత, భూమాతను కాపాడినవారమవుతామన్నారు. సింగల్ యూస్ ప్లాస్టిక్ తయారీదారులపై కఠిన నిర్ణయాలు తీసుకోవాలని కంపెనీ



యజమానులకు జైలు శిక్ష విధించే విధంగా చట్టం తీసుకురావాలన్నారు. పర్యావరణమే కాకుండా ప్రజల ఆరోగ్యాలు చెడిపోయి క్యాన్సర్ వివిధ రోగాలకు గురి అవుతున్నారని ప్రముఖ డాక్టర్ నాగేశ్వరరావు చెప్పడం కూడా మనం పేపర్లో చదివే ఉన్నామని, ఈ నిర్ణయానికి కట్టుబడి ఉండి ప్రజలను అవగాహన కల్పిస్తూ పాఠశాలల్లో, మందిరాల వద్ద ప్లెక్సీలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి కోల రవీందర్ ముదిరాజ్ పర్యావరణ సూచించారు. అలాగే జనపనారాతో , కాటన్ బట్టలు సబ్సిడిపై డ్వాక్రా సంఘాలకు సరఫరా చేస్తే వివిధ సైజులలో సంచులను తయారు చేసి దుకాణ దారులకు సరఫరా చేస్తారని, దీంతో ఉపాధి కల్పించిన వారమవుతారన్నారు. గ్రామ రైతు లకు ఉపాది, మోదుగ, అరటి మొక్కలు, పెంచుతారు, దాని వలన పశువుల కు దాన, పంటకు ఎరువు లభిస్తుందన్నారు.

## మంత్రి దంపతులను కలిసిన ఇల్లందు ఎమ్మెల్యే సతీమణి



ప్రజాస్ఫూర్తి ,ఇల్లందు: తెలంగాణా రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి , మాధురి దంపతులను ఇల్లందు నియోజకవర్గ ఎమ్మెల్యే కోరం కనకయ్య సతీమణి కోరం లక్ష్మీ గురువారం ఇల్లందు పట్టణ నాయకులతో కలిసి,ఖమ్మంలోని మంత్రి క్యాంపు కార్యాలయం నందు పొంగులేటి దంపతులను మర్యాద పూర్వకంగా కలిసారు.ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ నేతలు మడుగు సాంబమూర్తి, బోళ్ళ సూర్యం,చిల్లా శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు

## గిరిజన రైతుని వేధించిన సింగరేణి అధికారులపై చర్యలు తీసుకోవాలి



ప్రజాస్ఫూర్తి, ఇల్లందు: పాత పూసపల్లి శివారులో మాకు వ్యవసాయ భూములు ఉన్నాయి మేము గత 5060 సంవత్సరాలుగా మా తాతలు తండ్రులు దగ్గరనుంచి ఈ యొక్క వ్యవసాయ భూములను సేద్యము చేసుకొంటున్నాము నూతనంగా ఏర్పాటు చేయబోయే పూసపల్లి జేకె.ఓసీ లో మాయొక్క భూములు కోల్పోతున్నాం మాకు ఏడుగురికి రెవిన్యూ అధికారి ఎమ్మార్వో ఏడు (7) ఎకరాల భూమి కి సంబంధించి నోటీస్ లు ఇచ్చినారు.తేజవాత్ లాలు,యెట్టి హరికృష్ణ, బనోత్ నరేష్, బానోత్ రమేష్ ,మాన్సింగ్, తేజావత్ శ్రీకాంత్, తేజవత్ నాగ మిగతా రైతులకు నోటీస్ లు ఇవ్వలేదు మిగతా రైతులు బాణోత్ గణేష్, తేజవత్ అనిత, అందరూ భూమిని దుక్కి దున్నుకుంటుండగా సింగరేణి వాళ్ళు చెనులోకి వచ్చి గిరిజన రైతు బాణోత్ శంకర్ నీ దౌర్జన్యంగా నిర్బంధించి బొలెరో వాహనంలో బలవంతముగా ఎక్కించుకొని వాళ్ళ ఎస్ అండ్ పీసీ ఆఫీస్ కి తీసుకెళ్లిన గదిలో నిర్బంధించి మళ్ళీ అదే బొలెరో వాహనంలో ఎమ్మార్వో ఆఫీసుకి తీసుకువచ్చి రైతులను దుర్భాషలు మాట్లాడి మీరు రేపు చెను దగ్గరికి వస్తే బుల్డోజర్ తో తొక్కిస్తా అని మమ్ములను కులం పేరుతో దుషించిన సింగరేణి ఎస్ అండ్ పీసీ అధికారి అంజిరెడ్డి సింగరేణి ఎస్టేట్స్ అధికారి శివ మీదా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### బాలికల ఆత్మ రక్షణ కోసం
## కుంగ్ ఫూ, కరాటే లు అవసరం

* ఎస్ఐ విజయ్ భార్గవ్





చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: బాలికలు తమ ఆత్మరక్షణ కోసం కుంగ్ ఫూ, కరాటే నేర్చుకోవడం అవసరమని ఎస్ఐ విజయ్ భార్గవ్ అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం ప్రతిభ వొకేషనల్ జూనియర్ కళాశాల, శ్రీ మేధ జూనియర్ కళాశాలలో విధ్యార్థినులకు ఉచిత కుంగ్ ఫూ, కరాటే శిక్షణా కార్యక్రమాన్ని కుంగ్ ఫూ, కరాటే బ్లాక్ బెల్ట్ బొడ్డు పరమేష్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి ఎస్ఐ విజయ్ భార్గవ్ హాజరై, ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధ్యార్థులు సెల్ ఫోన్ లకు దూరంగా ఉండాలని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో తమ వ్యక్తిగత సమాచారం బహిర్గతం కాకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విధ్యార్థులు విధ్యపై ఆసక్తి పెంచుకొని లక్ష్యసాధనకై కృషి చేయాలన్నారు. విద్యార్థుల ఆత్మరక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన కళాశాల యాజమాన్యాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సిలివేరు ధనలక్ష్మి, ప్రిన్సిపాల్ సిలివేరు శ్రీనివాస్, లింగస్వామి, రాజు, నిరంజన్, బాలక్రిష్ణ , రాజేష్, జ్యోతి, రజిత, నవ్య , జ్యోతి, భాగ్యలక్ష్మి, రాణి విధ్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



### ఖాళీ స్థలాలు ఇచ్చిన పేదలకు
## ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి

* సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: పాత కొత్తగూడెంలో అసంపూర్తిగా నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇల్లు పూర్తి చేసి అర్హులైన పేదలకు ఇవ్వాలని అలాగే అదే పాత కొత్తగూడెంలో పేదలకు పంపిణీ చేసిన ఖాళీ స్థలంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఇంటి నిర్మాణం చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాత కొత్తగూడెంలో గల అసంపూర్తిగా నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇల్లు పేదలకు పంపిణీ చేసిన ఖాళీ స్థలాలను సిపిఎం బృందం సందర్శించింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఎం దశలవారీ పోరాట ఫలితంగా ప్రభుత్వం నలభై ఎకరాల ప్రభుత్వ భూమిని కొనుగోలు చేస్తే గత ప్రభుత్వం ఆర్భాటంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం చేపట్టి ఇల్లు పూర్తి అవ్వకుండానే మొండి గోడలకు డ్రా తీసి పేదలను మోసం చేసిందని వారు విమర్శించారు. అలాగే దెబ్బైనాలుగు గజాలు ఖాళీ స్థలం పంపిణీ చేసి చేతులు దులుపుకున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తామని హామీ ఇచ్చిందని హామీల అమలుకు సమీక్షా సమావేశాలు నిర్వహించడం వల్ల ప్రయోజనం లేదని ఇంటి నిర్మాణం పూర్తవుతుందా లేదా అనే క్షేత్రస్థాయి పరిశీలన ఉండాలని వారు సూచించారు. అలాగే గృహ నిర్మాణ శాఖ మంత్రి పాత డబల్ బెడ్ రూమ్ ఇండ్లను సందర్శించి గతంలో లబ్ధిదారులుగా ప్రకటించిన వారికి ఇందిరమ్మ ఇండ్ల పథకంలో డబల్ బెడ్ రూమ్ ఇల్లు పూర్తి చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఖాళీ స్థలం ఇచ్చిన పేదలకు ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు మంజూరు చేయాలని అక్కడ నివాసం ఉండడానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అసంపూర్తిగా ఉన్న డబల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం చేపట్టే వరకు పేదలకు పంచిన ఖాళీ స్థలంలో ఇంటి నిర్మాణానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం కోసం లబ్ధిదారులను కలుపుకొని భవిష్యత్తులో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్, టౌన్ కమిటీ సభ్యులు జునుమాల నగేష్, ఆవుల శ్రీరాములు, నాగకృష్ణ, ప్రమోద్, నాయకులు కొలిపాక వెంకటేశ్వర్లు, మురళి, మరియా కుక్కల ముతేష్, బాలకృష్ణ, రాములు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## కొంపల్లి పురపాలక సిబ్బంది కి బట్టలు, సబ్బులు , బూట్లు అందజేత



జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : కొంపల్లి పురపాలక సంఘ కార్యాలయంలో ప్రత్యేక అధికారి ఎ చంద్ర మోహన్ గురువారం కొంపల్లి పురపాలక సిబ్బంది కి బట్టలు, సబ్బులు , బూట్లు అందజేశారు. ఈ కార్యక్రమములో కమిషనర్ ఎన్. కృష్ణారెడ్డి, డిప్యూటి ఈఈ తిరుపతి, ఆర్ఐ రాజు, సానిటరీ ఇన్స్పెక్టర్ బి. జానీ, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ రాఘవాచారి, మునిసిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లమ్మ, పోచమ్మ, మైసమ్మ అమ్మవార్లకు జె.కె శేఖర్ యాదవ్ ప్రత్యేక పూజలు



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని మైసమ్మ నగర్ బి బ్లాక్ లో గల ఎల్లమ్మ, పోచమ్మ, మైసమ్మ ఆలయాలలో గురువారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ జె.కె శేఖర్ యాదవ్ పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవార్ల కృపతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని వర్షాలు బాగా పడి రైతులు సంతోషంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో మైసమ్మ నగర్ బి బ్లాక్ అధ్యక్షులు బసవప్ప, ప్రధాన కార్యదర్శి రవీందర్ రెడ్డి, కోశాధికారి శ్రీకాంత్ యాదవ్, శ్రీకాంత్ చార్యులు, బస్తీ పెద్దలు ఏ బ్లాక్ అధ్యక్షులు బ్రహ్మం, పిల్లి ఆంజనేయులు , హనుమంతు , పాపి రెడ్డి , శ్రీనివాస్ రెడ్డి , రవి భక్తులు తదితరులు పాల్గొన్నారు

## వీధి కుక్కలు.. విషసర్పాలు..!







* మందు బాబుల చిందులు..!
* బిక్కుబిక్కుమంటున్న స్థానికులు..!
* చర్యలు తీసుకోవాలంటూ అధికారులకు ఫిర్యాదులు..!

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని రామవరం క్లబ్ ఏరియా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీధి కుక్కల బెడద, విషసర్పాల సంచారం, మద్యపాన గంజాయి సేవించే వారితో తీవ్రంగా భయంభ్రాంతులకు గురి అవుతున్నారు . ఈ సమస్యపై స్థానికులు ఫోటోలతో సహా అధికారులకు ఫిర్యాదు చేస్తూ తక్షణ చర్యలు కోరుతున్నారు.

**వీధి కుక్కల భయాందోళన**

ప్రధాన రహదారిపై ఉన్న మటన్, చికెన్ షాపులు పారవేసే మాంసపు వ్యర్థాల కారణంగా వీధి కుక్కలు పెద్ద ఎత్తున చేరుకుంటున్నాయి.

ఇళ్లలో పెంచిన కోళ్లను దాడి చేసి చంపుతున్నాయి.

2025లో వీధి కుక్కల దాడితో ఒక బాలుడు రాబిస్‌తో మృతి చెందిన సంఘటన ఇప్పటికీ ప్రజల్లో భయం నింపుతోంది. రాత్రివేళ బయటికి రావడానికే ప్రజలు భయపడుతున్నారు.

పూర్తికాని క్రీడా మైదానం - మద్య, గంజాయి బాబు లకు అడ్డాగా

రామవరం పాత రామచంద్ర డిగ్రీ కళాశాల స్థలంలో రూ.1.35 కోట్లతో ప్రారంభించిన తెలంగాణ క్రీడా మైదాన అభివృద్ధి పనులు ఇంకా పూర్తికాలేదు.నిలిచిపోయిన ఈ క్రీడా ప్రాంగణం ఇప్పుడు మందుబాబులు, గంజాయి సేవించే వారి కేంద్రంగా మారింది. ప్రతిరోజూ గొడవలు, అసాంఘిక కార్యకలాపాలు చోటుచేసుకుంటున్నాయి.



**స్థానికుల డిమాండ్**

వీధి కుక్కలు, విషసర్పాల నియంత్రణకు మున్సిపల్ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలి.పెండింగ్‌లో ఉన్న క్రీడా మైదానం, పార్క్ అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారించి మద్యపాన, గంజాయి సేవనాన్ని అరికట్టాలి. రామవరం వెల్ఫేర్ సెంటర్ ఏరియా ప్రాంత ప్రజల భద్రత కోసం తక్షణమే చర్యలు తీసుకోవాలి అని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఆగస్టు 3న శ్రీ అభయాంజనేయ స్వామి వారి తృతీయ వార్షికోత్సవం

జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : చింతల్ డివిజన్ పరిధిలోని శ్రీ సాయి కాలనీ లో గల శ్రీ అభయాంజనేయ స్వామి వారి తృతీయ వార్షికోత్సవం ఆగష్టు 3వ తేదిన అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలోస్వామి వారికి విశ్వక్సెన పూజ, పుణ్యాహవచనం, కలశారాధన, మన్యుసూక్త హోమం, మూల మంత్ర హోమం, పూర్ణాహుతి, స్వామి వారికి శత ఘటాభిషేకం, సహస్ర నాగవల్లీ దళార్చన, దూప దీప నివేదన, హారతులు, మంత్ర పుష్పం, నిర్వహించనున్నట్లు తెలిపారు. పోచమ్మ అమ్మవారి సన్నిధిలో ఉదయం 8 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశారాధన, చండీ హోమం, అభిషేకం, అలంకరణ, అష్టోతర పూజ, దూప దీపనివేదన, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణ ఆశీర్వచనం, మధ్యాహ్నం 1 గంటలకు అన్నదాన కార్యక్రమం తో పాటు సాయంత్రం 6 గంటలకు స్వామి వారి ఉరేగింపు సేవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలన్నారు. అదే విధంగా ఆగస్టు 15 న సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు సామూహిక వరలక్ష్మీ వ్రతములు జరుపపడుతాయని తెలిపారు.

# సమాచార హక్కు చట్టం ప్రజల ప్రాథమిక హక్కు...

* ప్రజలకు ప్రభుత్వానికి జవాబుదారీ తనంగా అధికారులు ఉండాలి..
* సమాచార హక్కు చట్టం అవగాహన సదస్సులో ప్రధాన కమిషనర్ బోరెడ్డి అయోధ్య రెడ్డి.

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: సమాచార హక్కు ప్రజల ప్రాథమిక హక్కు అని, ప్రజల హక్కును కాపాడటానికి అధికారులు ప్రజలకు ప్రభుత్వానికి జవాబు దారితనంగా వారధిలా నిలువాలని సమాచార హక్కు చట్టం ప్రధాన కమిషనర్ బోరెడ్డి అయోధ్య రెడ్డి పిలుపునిచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సమాచార హక్కు చట్టం ( ఆర్టిఐ ) అమలు పరిస్థితిని సమీక్షించేందుకు రాష్ట్ర ప్రధాన కమిషనర్ బో రెడ్డి అయోధ్య రెడ్డి, సహ కమిషనర్లు దేశాల భూపాల్ , పి.వి. శ్రీనివాస్ రావు గురువారం జిల్లాకు విచ్చేశారు. జిల్లాకు విచ్చేసిన కమిషనర్లకు ముందుగా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు , జిల్లా ట్రైనింగ్ కలెక్టర్ సౌరబ్ శర్మ పూల మొక్కలు ఇచ్చి ఆహ్వానం పలికారు. అనంతరం ప్రధాన కమిషనర్ బోరేటి అయోధ్య రెడ్డి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఐ డి ఓ సి కార్యాలయం ప్రాంగణంలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా కమిషనర్లు మొక్కలు నాటారు. జిల్లాలో సమాచార హక్కు చట్టం కమిషనర్ల పర్యటన నేపథ్యంలో ఐడిఓసి కార్యాలయం సమావేశం మందిరం లో ఆర్.టి.ఐ యాక్ట్ అమలు చేయు విధివిధానాలపై క్షుణ్ణంగా పౌర సమాచార అధికారులకు చట్టనిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సదస్సుకు రాష్ట్ర ముఖ్య పౌర సమాచార కమిషనర్ బో రెడ్డి అయోధ్య రెడ్డి, ఇతర కమిషనర్లు పి.వి శ్రీనివాసరావు, దేశాల భూపాల్, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మరియు ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టిఐ కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన మొదటిసారిగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు రావడం జరిగిందని






సమాచార హక్కు చట్టం అవగాహన సదస్సు ఏర్పాటు చేయడానికి జిల్లా కలెక్టర్ , వివిధ శాఖల అధికారులు చూపించిన చొరవ హర్షించదగ్గ విషయం అని అన్నారు. సమాచార హక్కు చట్టం 136 దేశాల్లో అమలు అవుతుందన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆర్టిఐ సమర్థవంతంగా అమలవుతుందన్నారు. సమాచార హక్కు చట్టంపై పౌర సమాచార అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ పథకాల అమలు, నిధుల వినియోగం, అవినీతి నిర్మూలన లక్ష్యంగా సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చింది అన్నారు. ఈ చట్టంలోని సెక్షన్లు, సబ్ సెక్షన్ లపై పౌర సమాచార అధికారులు చదివి సమగ్ర అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో ఉన్న 29 ప్రభుత్వ శాఖల్లో 15 శాఖల్లో ఎటువంటి కేసులు లేకపోవడం హర్షించదగ్గ విషయంగా ఆయన పేర్కొన్నారు. 136 దేశాల్లో ఆర్టిఐ యాక్ట్ అమల్లో ఉందన్నారు. ప్రపంచంలోనే భారతదేశం 8వ స్థానంలో ఉందని, రాబోయే రోజుల్లో మొదటి స్థానానికి రావాలని అదేవిధంగా దేశంలో తెలంగాణ రాష్ట్రం మొదటి స్థానంలో నిలిపే విధంగా కృషి చేస్తామన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలకు జవాబు గారితనం ఎంత అవసరమో పారదర్శకత కూడా అంతే అవసరమని ఆర్టిఐ యాక్ట్ ద్వారా పూర్తి సమాచారం అందించినప్పుడు మాత్రమే జవాబుదారీతనం , పారదర్శకతకు సార్థకత చేకూరుతుందన్నారు. గత పది సంవత్సరాల కాలంలో సమాచార కమిషనర్ అందుబాటులో ఉంచకపోవడం వల్ల రాష్ట్రంలో 18 వేల కేసులు సమాచార హక్కు చట్టం కమిషనర్ దగ్గర పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. ఆగస్టు నెలలో పెండింగ్లో ఉన్న కేసులను పూర్తిగా పరిష్కరించి కొత్త దరఖాస్తుల ద్వారా ముందుకు వెళ్ళబోతున్నామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. రెండు నెలల్లో 30 శాఖల కేసులు పూర్తిగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రజలు సమాచారం కోసం సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లో సమాచారం అందజేయాలని, ప్రతి ప్రభుత్వ కార్యాలయం వద్ద సిటిజన్ షార్ట్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. సరైన కారణాలు చూపించకుండా ఆర్టిఐ యాక్ట్ ద్వారా చేసుకున్న దరఖాస్తులను తిరస్కరించకూడదని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. సమాచార హక్కు చట్టం అందుబాటులో ఉంది కాబట్టి అధికారులందరూ బాధ్యతగా తీసుకొని త్వరితగతిన తగిన సమాచారం ప్రజలకు అందించాలన్నారు. సమాచార హక్కు చట్టం పై పౌర సమాచార అధికారులకు అవగాహన పెంపొందించే విధంగా రాష్ట్రంలో 11 జిల్లాలు ఎంపిక చేసుకుని చట్టంలోని సెక్షన్ల పై పూర్తి అవగాహన కల్పిస్తున్నామన్నారు. దీని ద్వారా ఆర్టిఐ కేసులను త్వరితగతిన పరిష్కరించవచ్చు అన్నారు. అధికారులందరూ ప్రజలకి తగిన సమాచారం అందించేందుకు ముందుకు రావాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 22 జిల్లాల్లో 17 శాఖల్లో వచ్చే మార్చి లోపు అన్ని కేసులు పరిష్కార మార్గాలు చూపి సమాచారం అందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. మరుగున పడిన వ్యవస్థను నూతన ఉత్సాహంతో ముందుకు తీసుకువచ్చి ప్రజలకు ఖచ్చితమైన సమాచారం అందించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో సమాచార హక్కు చట్టాన్ని పటిష్టంగా అమలయ్యే అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. అన్ని శాఖల అధికారులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించే విధంగా సమావేశాలు , శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు ఎటువంటి పరిస్థితుల్లో నైనా సమాచారం కావాలని దరఖాస్తు చేసుకున్నప్పుడు నిబంధనలకు లోబడి సమాచారం అందించే విధంగా అన్ని శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నామని వివరించారు. ఈ అవగాహన సదస్సులో భాగంగా పౌర సమాచార అధికారులకు సమాచార హక్కు చట్టంపై ఉన్న సందేహాలను కమిషనర్లు నివృత్తి చేశారు. జిల్లాకు మొదటి సారిగా విచ్చేసిన సమాచార హక్కు కమిషనర్లను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ శాలువా , మెమొంటోతో సత్కరించారు. ఈ అవగాహన సదస్సులో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జెడ్పి సీఈవో నాగలక్ష్మి, ఆర్డీవోలు మధు, దామోదర్, అన్ని శాఖల పౌర సమాచార అధికారులు , తదితరులు పాల్గొన్నారు.

## ఆందోల్ నియోజకవర్గంలో పర్యటించిన మంత్రి



అందోలు, ప్రజాస్ఫూర్తి: రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆందోల్ నియోజకవర్గం లోని చౌటకూరు, అందోల్ , వట్ పల్లి మండలాల్లో పర్యటించారు. పర్యటనలో భాగంగా చౌటకూరు మండలం లోని చక్రియాల లోని హున్నా పూర్ లో కాంగ్రెస్ పార్టీ కీ చెందిన దళిత సీనియర్ నాయకులు కృష్ణంరాజు ఇటీవల అనారోగ్యం తో చనిపోయిన సమాచారం తెలుసుకొని వారి ఇంటికి వెళ్ళి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని మంత్రి భరోసా కల్పించారు. అనంతరం జోగిపేట కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో ఏర్పాటు చేసిన మాజీ సర్పంచ్ డాకూరి జోగినాథ్ గారి వర్ధంతి కార్యక్రమం లో పాల్గొని వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం , ఆగష్టు 1, 2 వ తేదీలలో అందోల్ లో ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ల పర్యటన లో భాగంగా నిర్వహిస్తున్న జనహిత పాదయాత్ర , శ్రమదానం , కార్యకర్తలతో సమావేశం ఏర్పాట్లను ముఖ్య నాయకులతో కలసి పరిశీలించారు . అందోల్ లో జరిగే జనహిత పాదయాత్రలో పాల్గొనేందుకు నియోజకవర్గం లోని అన్ని మండలాల నుండి వేలాదిగా తరలివస్తున్న కార్యకర్తలకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా పాదయాత్ర విజయవంతం అయ్యేలా ముందస్తూ ఏర్పాట్లను మంత్రి దామోదర్ రాజనర్సింహ క్షేత్రస్థాయి లో పరిశీలించారు . అందోల్ మండలం డాకూర్, వట్ పల్లి మండలం మర్వెల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ పర్యటనలో పీసీసీ ఉపాధ్యక్షులు సంగమేశ్వర్ , సిలారపు త్రిష రాజనర్సింహ , నియోజక వర్గం లోని అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు , ఏయంసీ చైర్మన్ లు , ఆత్మ కమిటీ చైర్మన్ లు , మాజీ జడ్పీటీసీ లు , మాజీ ప్రజా ప్రతినిధులు , ముఖ్య నాయకులు మంత్రి వెంట పాల్గొన్నారు.

## మహిళల అభ్యున్నతి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుంది

* మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా

మేడ్చల్ ప్రతినిధి, (ప్రజాస్ఫూర్తి) : రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభ్యున్నతి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, మహిళలందరు ఇట్టి పథకాలను సద్వినియోగం చేసుకోని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వీ హబ్ డీఆర్డిఎ ఆధ్వర్యంలో జిల్లాలోని ఎస్హెచ్ జీ మహిళలు, మహిళా పారిశ్రామికవేత్తలకు ర్యాంప్ (రైసింగ్ అండ్ యాక్సిలరేటింగ్ ఎంఎస్ఎంఈ పెర్ఫార్మెన్స్ స్కీమ్) ప్రోగ్రాం పైన నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి అదనపు కలెక్టర్ రాధిక గుప్తా మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలనే సంకల్పంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వయం సహాయక మహిళలకు అధిక మొత్తం రుణాలను 35 శాతం సబ్సిడీతో పాటు అనేక సంక్షేమ పథకాలను అమలు పర్చుస్తుందని, మహిళలు అనేక రకాల వ్యాపారాలు చేస్తున్నారని, వ్యాపారంలో లాభాలను ఆర్జించడం సంతోషం కరమని తెలిపారు. మహిళలకు వ్యాపారంలో మార్కెటింగ్ చేయుటకు, రుణాల పొందుటలో ఎమైనా సమస్యలు వస్తే తమ దృష్టి తీసుకురావాలని ఆమె తెలిపారు. నేటి ఆధునిక, సాంకేతిక యుగంలో మహిళలు అన్నిరంగాల్లో రాణించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపికైన మహిళ వ్యాపారులకు బిజినెస్ నైపుణ్యాలపై శిక్షణ, ప్రొడక్ట్ డెవలప్మెంట్, మార్కెటింగ్ పై అవగాహన అందిస్తారన్నారు. వీ హబ్ డైరెక్టర్ జాహిద్ షేక్ మాట్లాడుతూ వరల్డ్ బ్యాంక్ .కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ ఎంఎస్ఎంఈ ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ ప్రోగ్రాం ద్వారా మహిళల ఆధ్వర్యంలో




నడుస్తున్న వ్యాపారాలు/ సూక్ష్మ,చిన్న, మధ్యతరగతి (ఎంఎస్ఎంఈ ) వ్యాపారస్తులకు సబ్సిడీ పై ఆర్థిక సహాయం అందనుందన్నారు. రెండు సంవత్సరాల పాటు కొనసాగనున్న ఈ ప్రోగ్రాం లో రాష్ట్ర వ్యాప్తంగా ఎంపికైన మహిళా పారిశ్రామికవేత్తలకు తమ బిజినెస్ అభివృద్ధిని వేగవంతం చేసుకొని వ్యక్తిగతంగా తమ ఆదాయాన్ని పెంచుకునే అవకాశం లభిస్తుందన్నారు. వీ హబ్ అసోసియేట్ డైరెక్టర్ ఊహ మాట్లాడుతూ దీనిలో భాగంగా టెక్స్టైల్స్, ఫుడ్ మాన్యుఫాక్చరింగ్, హస్తకళలు వంటి రంగాల్లోని మహిళా వ్యాపారులకు బిజినెస్ నైపుణ్యాలపై శిక్షణ, ప్రొడక్ట్ డెవలప్మెంట్ అండ్ డైవర్సిఫికేషన్, బ్రాండింగ్ & మార్కెట్ యాక్సెస్, క్రెడిట్ లింకేజ్, ఎక్స్పర్ట్ మెంటరింగ్ మద్దతు అందనుందన్నారు. అనంతరం ఈ ప్రాథమిక శిక్షణలో, ప్రోగ్రాం పైన అవగాహన కల్పించి సభ్యుల వారి నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీ.ఆర్.డీ.ఓ సాంబశివరావు, పీడీ మెప్మ విజయ లక్ష్మీ, వీ హబ్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ సాయిరామ్, జిల్లా స్వయం సహాక సంఘాల అధ్యక్షులు అజయ లక్ష్మి, డిఆర్పి డిఎస్. అమర్సింగ్ , జిల్లాలోని స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఇతర అధికారులు తదితరులు, వీ హబ్ సభ్యులు పాల్గొన్నారు.




## టీవిఆర్ మోడల్ హై స్కూల్ లో ఘనంగా గ్రీన్ కలర్ డే వేడుకలు

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : కుత్బుల్లాపూర్ సర్కిల్ సుభాష్నగర్ డివిజన్ పరిధి అపూరూప కాలనీలో గల టీవిఆర్ మోడల్ హై స్కూల్ లో గ్రీన్ కలర్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం పాఠశాలలో ఎల్ కెజీ, యుకేజీ విద్యార్థులకు నిర్వహించిన గ్రీన్ కలర్ డే వేడుకలలో టీ వి అర్" గ్రూప్ ఆఫ్ స్కూల్స్ మేనేజింగ్ డైరెక్టర్ వంశీకృష్ణ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ ఆషాడ , శ్రావణ మాసాలలో పచ్చని చెట్లు చిగురించి ప్రకృతి కనులవిందు చేస్తుందన్నారు. ప్రకృతి నుండి మనకు లభించే బొప్పాయ సీతాఫల, బత్తాయి వంటి పండ్లు కాయలు తినడం వల్ల జరిగే ఆరోగ్య లాభాలను తరగతి గదిలో నేర్పించడం మా ప్రత్యేకత అన్నారు. కూరగాయలకు అనుకూలమైన వాతావరణం ఆకుపచ్చదనాన్ని నిండుగా వెదజల్లే ప్రకృతి మానవాళికి ప్రాణవాయువును అందించడం , ఇవన్నీ కూడా మానవ జీవితానికి అత్యంత ముఖ్యమైనటువంటివి అని తెలుపుటకు గ్రీన్ కలర్ డే ను నిర్వహించి వాటి ప్రాముఖ్యతను తెలియజేయడం చిన్నారులకు ఆరోగ్య లాభాలను చేకూర్చే ఆకుకూరలు విటమిన్లు కలిగిన పండ్లు కూరగాయలను ఆరోగ్యాన్ని ఇచ్చేవి గా గుర్తించడం చిన్నారులకు అవగాహన కల్పించడం తద్వారా తల్లిదండ్రులకు తెలియజేయడం మా బాధ్యత అన్నారు. చిన్ననాటి నుండి విద్యార్థిని విద్యార్థులకు రంగులు వాటి ప్రాముఖ్యత వివిధ రకాల పోషక ఆహారాలను వివరించడం వల్ల చిన్నారులు చైతన్యవంతులుగా అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జయరాజు , ప్రీ ప్రైమరీ అధ్యాపక బృందం, ఎల్ కె.జీ, యుకెజీ విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## జూలకంటి రంగారెడ్డికి వినతిపత్రం అందజేసిన ప్రైవేటు కళాశాల యాజమాన్యం



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ప్రైవేటు జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యులు సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డిని మండలంలోని కోయ్యలగూడెం గ్రామంలో మర్యాదపూర్వకంగా కలిసి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం వినతిపత్రం అందజేశారు. గత నాలుగు సంవత్సరాల నుంచి స్కాలర్షిప్లు రాక ఇబ్బందులు పడుతున్నామని, కనీసం కరెంటు బిల్లులు కట్టలేని పరిస్థితిలో ఉన్నామని, అధ్యాపకులకు జీతాలు ఇవ్వడానికి కూడా ఇబ్బంది పడుతున్నామని, కాలేజీ భవనాలకు అద్దె చెల్లించడానికి చాలా ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడి సిపిఎం పార్టీ తరపున తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రైవేటు జూనియర్ కళాశాల యాజమాన్యాలు బత్తుల శంకర్, గంగాపురం జంగయ్య, వల్ల మల్ల రాజశేఖర్, సిలివేరు శ్రీనివాస్, సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు గోశిక కరుణాకర్ తదితరులున్నారు

# నేడు అందోలులో మీనాక్షి నటరాజన్ పాదయాత్ర..

- సంగుపేట నుంచి పాదయాత్ర ప్రారంభం
- భారీగా స్వాగత ఏర్పాట్లు
- విజయవంతం చేయాలని మంత్రి దామోదర పిలుపు...

అందోలు, ప్రజాస్ఫూర్తి: ఏఐసీసీ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ శుక్రవారం అందోలు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఆమె పర్యటన సందర్భంగా పార్టీ శ్రేణులు భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి సి.దామోదర్ రాజనర్సింహ గత రెండు రోజులుగా జోగిపేటలోనే మకాం వేసి కార్యక్రమం విజయవంతం చేయాలని కార్యకర్తలు, ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి ముఖ్య కార్యకర్తలు, నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొనే కార్యక్రమాన్ని రూపొందించారు. ఏఐసీసీ నాయకుడు రాహుల్ గాంధీ జోడో యాత్ర



తర్వాత అదే స్థాయిలో అందోలులో మరోసారి పాదయాత్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఆమె పర్యటన రెండు రోజుల పాటు జరుగనున్నందున కార్యక్రమాలు విజయవంతం అయ్యేలా ఏర్పాట్లు చేయాలని నాయకులకు మంత్రి కార్యకర్తలకు సూచించారు. రాహుల్ జోడోయాత్ర తరహాలోనే ఈ పాదయాత్రను కూడా విజయవంతం అయ్యేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.

**సంగుపేట నుంచి జోగిపేట వరకు జనహిత పాదయాత్ర...**

ఏఐసీసీ రాష్ట్ర ఇంచార్జీ మీనాక్షి నటరాజన్




చేపడుతున్న పాదయాత్రకు జనహిత పాదయాత్రగా నామకరణం చేసారు. అందోలు మండలం సంగుపేట నుంచి జోగిపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వరకు పాదయాత్ర కొనసాగనుంది. సంగుపేట వద్ద మీనాక్షి నటరాజన్కు పెద్ద ఎత్తున స్వాగత ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు సంగుపేట వరకు ఆమె చేరుకుంటుంది. సంగుపేట వద్ద కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగరవేసి పాదయాత్రను ప్రారంభమై, జోగిపేట కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వరకు చేపట్టనున్నారు. అందుకు జోగిపేటలోని కాంగ్రేస్ పార్టీ కార్యాలయానికి అందంగా తీర్చిదిద్దుతున్నారు. దారిపొడగునా ఎల్ఈడీ లైటింగులను ఏర్పాటు చేస్తున్నారు. దారి పొడవునా భారీ కటౌట్లు, ఫ్లెక్సీలు, కమాన్లు, బెలూన్లు, పార్టీ జెండాలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తున్నారు.

**విజయవంతం చేయాలని మంత్రి దామోదర పిలుపు**

మీనాక్షి నటరాజన్ శుక్రవారం చేపడుతున్న జనహిత పాదయాత్రను విజయవంతం చేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ యాత్రలో నియోజకవర్గంలోని పార్టీకి ముఖ్యనాయకులు, కార్యకర్తలు, ప్రజలు స్వచ్ఛందంగా హజరై పెద్ద సంఖ్యలో పాదయాత్రలో పాల్గొనాలని ఆయన సూచించారు. ఆగస్టు 2వ తేదీన శ్రమదానంలో పాల్గొంటారని, మధ్యాహ్నం 3 గంటలకు లక్ష్మిదేవీ గార్డెన్స్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఉంటుందని ఆయన తెలిపారు.

# చవకబారు వ్యాఖ్యలు చేసిన వ్యక్తికి జగన్ పరామర్శ సిగ్గుచేటు: మంత్రి అనిత

అమరావతి: జైల్ల యాత్ర పేరుతో మాజీ సీఎం జగన్ విచిత్ర వేషాలు వేస్తున్నారని ఏపీ హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత మండిపడ్డారు. మహిళలను ఎవరైనా కించపరిస్తే వారిని ప్రోత్సహిస్తామనే జగన్ ధోరణి సీఎంగా ఉన్నప్పుడు మారలేదని.. ఇప్పుడూ పోలేదని విమర్శించారు. చెల్లి వరుసయ్యే మహిళా నేతపై వ్యక్తిత్వ హననం చేసిన వారికి జగన్ మద్దతు పలకటాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. నెల్లూరులో జగన్ పర్యటనపై మంత్రి అనిత మీడియాతో మాట్లాడారు. "వైకాపా మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి వ్యాఖ్యలను కోర్టులు తప్పుపట్టాయి. సభ్య సమాజం ఛీకొడుతుంటే జగన్ ఒక్కరే వారికి మద్దతిస్తున్నారు. రాజకీయంగా



ప్రశాంతిరెడ్డిని ఎదుర్కోలేక చవకబారు వ్యాఖ్యలు చేసిన ప్రసన్నకుమార్‌రెడ్డికి జగన్ పరామర్శ సిగ్గుచేటు. ఆస్తి పంపకాల విషయంలో తల్లీచెల్లిపై కోర్టులో గెలిచానని వీరంగం చేసే వ్యక్తిని జగన్‌లోనే చూశా. జగన్ చేసేది పరామర్శలా? బల ప్రదర్శనలా? పరామర్శల పేరుతో బలప్రదర్శనలు చేస్తే పోలీసులు అనుమతులు ఇవ్వాలా? సాక్షి టీవీలో జగన్ నెల్లూరు పర్యటనలో ఫేక్ విజువల్స్ ప్రసారం చేశారు. లేని జనాల్ని చూపించటానికి బంగారుపాళ్యం విజువల్స్‌ను నెల్లూరు పర్యటనగా చూపించారు. విశ్వసనీయత, పత్రికా విలువల గురించి గొప్పగా లెక్చర్లు ఇచ్చిన భారతీరెడ్డి ఈ ఫేక్ వీడియోలపై ఏం సమాధానం చెప్తారు?" అని మంత్రి అని ప్రశ్నించారు.

## జగన్ పరిపాలన చేయలేదు.. అవినీతి ముఠాను నడిపారు : మాణికం ఠాగూర్



అమరావతి: ఏపీ మాజీ సీఎం, వైకాపా అధినేత జగన్ ఓ అవినీతి శాస్త్రవేత్త అని ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జి మాణికం ఠాగూర్ వ్యాఖ్యానించారు. మద్యం ముడుపుల కేసులో రూ.11 కోట్లు దొరకటంపై ఆయన స్పందించారు. "తొలి విడతలో రూ.11 కోట్ల మద్యం ముడుపులు పట్టుబడ్డాయి. జగన్ చేసిన దోపిడీ నగదు ప్రస్తుతం పోలీసుల కస్టడీలో ఉంది. మొత్తం రూ. 3,500 కోట్ల స్కామ్ జరిగింది. మద్యం ముడుపులతోనే సినిమాలు, ఆస్పత్రులు నిర్మించారు. ఆ డబ్బుతోనే షెల్ కంపెనీలు ఏర్పాటు చేశారు. ఈ కుంభకోణంలో మనీలాండరింగ్ జరిగింది. జగన్ పరిపాలన చేయలేదు.. అవినీతి ముఠాను నడిపారు." అని విమర్శలు గుప్పించారు.

## శ్రీవారి ఆలయం ముందు రీల్స్ చేస్తే కఠిన చర్యలు.. తితిదే హెచ్చరిక



తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయం ముందు, మాడ వీధుల్లో కొంతమంది వెకిలి చేష్టలు, డ్యాన్సలతో సోషల్ మీడియా రీల్స్ చేస్తుండటంపై తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలాంటి వీడియోలు చిత్రీకరించేవారిని తితిదే విజిలెన్స్ సిబ్బంది గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించింది. భక్తుల మనోభావాలను దెబ్బతీసే ఈ తరహా చర్యలు ఆధ్యాత్మిక వాతావరణానికి విఘాతం కలిగిస్తున్నాయని తితిదే పేర్కొంది. పవిత్రమైన క్షేత్రంలో ఇలాంటి అభ్యంతరకర, అసభ్యకర చర్యలు అనుచితమని.. ఇక్కడ కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమాలకే పరిమితం కావాలని సూచించింది. తిరుమల క్షేత్రం భక్తి, ఆరాధనలకు నిలయమనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని పేర్కొంది. శ్రీవారి దర్శనార్థం వచ్చే లక్షలాది మంది భక్తుల మనోభావాల పట్ల గౌరవం చూపడం ప్రతి ఒక్కరి బాధ్యత అని.. క్షేత్ర పవిత్రతకు భంగం కలిగేలా వ్యవహరించే వ్యక్తులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపడతామని తితిదే తెలిపింది.




## మహిళల ఉచిత బస్ టికెట్‌కు "స్త్రీ శక్తి"గా నామకరణం

ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రభుత్వం కల్పించనుంది. ఈ మేరకు ఇప్పటి నుంచే అన్ని ఏర్పాట్లు చేస్తోంది. బస్సులో ప్రయాణించే మహిళా ప్రయాణికులకు ఇప్పటి వరకూ ధర కూడిన టికెట్‌ను ఇచ్చారు. ఉచితంగా ప్రయాణిస్తే టికెట్ ఎలా ఉంటుంది అనే ప్రశ్నలు ప్రతి ఒక్కరిలో నెలకొన్నాయి. దీంతో ప్రభుత్వం టికెట్ నమూనాను రెడీ చేసింది. ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించేందుకు వీలుగా ముద్రించిన నమూనా టికెట్‌ను బయటకు విడుదల చేసింది. ఉచిత బస్ టికెట్‌పై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, డిపో పేరు, "స్త్రీ శక్తి" గా టికెట్ పేరు, ప్రయాణించే ప్రదేశం, చేరాల్సిన గమ్యస్థానం వంటి అంశాల్ని దానిపై ముద్రించారు. చెల్లించాల్సిన మొత్తం ధర రూ.0.00గా ముద్రించిన టికెట్ బయటకు వచ్చింది. దీంతో ఈ టికెట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

## చేసిన తప్పులకు పశ్చాత్తాపం లేని జగన్‌ను ప్రజలు ఎప్పటికీ క్షమించరు

**: మంత్రి నిమ్మల**

పాలకొల్లు: జగన్ ఐదేళ్ల పాలనలో సీఎంఆర్‌ఎఫ్ నిధులను పక్కదోవ పట్టించారని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. పేదలకు వైద్య సాయం అందించకుండా మానవత్వం మరిచారని మండిపడ్డారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గంలో గురువారం మంత్రి నిమ్మల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. 82 మందికి రూ.61 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇంకా మిగిలిపోయిన వనరులను దోచుకోవడానికే జగన్ ఆరాట పడుతున్నారని దుయ్యబట్టారు. చేసిన తప్పులకు పశ్చాత్తాపం లేని ఆయన్ను ప్రజలు ఎప్పటికీ క్షమించరని మండిపడ్డారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నా, చంద్రబాబు మానవత్వంతో సీఎం సహాయనిధిని పునరుద్ధరించారని గుర్తుచేశారు. జగన్ హయాంలో ఆస్పత్రుల యాజమాన్యాలకు చెల్లించాల్సిన నిధులను సైతం కూటమి



ప్రభుత్వమే చెల్లించిందన్నారు. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్ర విధ్వంసంతో పాటు ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేశారని విమర్శించారు.

## పార్లమెంటు ఆవరణలో బాలయ్య సందడి.. ఎంపీ కలిశెట్టి సైకిల్‌పై సవారీ

దిల్లీ: పార్లమెంటు ఆవరణలో నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సందడి చేశారు. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పార్టీ ఎంపీలతో కలిసి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో భేటీ అయ్యారు. తన నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు వినతులు సమర్పించారు. అంతకుముందు బాలకృష్ణకు తెదేపా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తాను రోజూ పార్లమెంటుకు వచ్చేందుకు ఉపయోగించే సైకిల్‌ను చూపించారు. దీంతో బాలయ్య అక్కడ సరదాగా కాసేపు సైకిల్ నడిపారు.





## వాళ్లకు తోబుట్టువుల్లా తోడుంటాం

**: ఎమ్మెల్సీ నాగబాబు**

జనసేన వీర మహిళలకు తోబుట్టువుల్లా తోడుంటామని ఎమ్మెల్సీ, జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు హామీ ఇచ్చారు. విశాఖపట్నం జిల్లా వీర మహిళలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ మహిళలను అనాదిగా నాలుగు గోడలకే పరిమితం చేశారని, ఆ పరిస్థితుల నుంచి విద్య, వ్యాపార, సాంకేతిక పరిజ్ఞానంలో ముందుండే స్థాయికి ఎదిగారని చెప్పారు. రాజకీయ, సామాజిక అంశాల్లో మహిళా శక్తి చాలా కీలకంగా మారనుందని నాగబాబు పేర్కొన్నారు.

## ఏపీ సీఐడీ మాజీ చీఫ్ సంజయ్ ముందస్తు బెయిల్ రద్దు

దిల్లీ: ఏపీ సీఐడీ మాజీ చీఫ్ సంజయ్ ముందస్తు బెయిల్‌ను సుప్రీంకోర్టు రద్దు చేసింది. సంజయ్‌కు ముందస్తు బెయిల్ ఇస్తూ గతంలో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేస్తూ గురువారం ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ముందు లొంగిపోవడానికి మూడు వారాల సమయం ఇచ్చింది. సంజయ్ కస్టడీ కోసం మేజిస్ట్రేట్ కోర్టులో దర్యాప్తు సంస్థ పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని, బెయిల్ కోరుతూ నిందితుడు మేజిస్ట్రేట్ కోర్టును ఆశ్రయించవచ్చని తెలిపింది. అగ్నిమాపక విభాగంలో అవినీతి కేసులో ఆయనపై ఏపీ ప్రభుత్వం ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ కేసులో సంజయ్‌కు ఏపీ హైకోర్టు ముందస్తు బెయిల్ ఇచ్చింది. ఉన్నత న్యాయస్థానం తీర్పును రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. దీనిపై సుదీర్ఘ వాదనల తర్వాత జస్టిస్ అమానుతుల్లా, జస్టిస్ ఎస్.వి.ఎన్ భట్టి ధర్మాసనం ఇవాళ తీర్పు వెలువరించింది. సంజయ్‌కి ముందస్తు బెయిల్ ఇస్తూ రాష్ట్ర హైకోర్టు 49 పేజీల తీర్పు రాయడంపై గత విచారణ సందర్భంగా ధర్మాసనం విస్మయం వ్యక్తం చేసింది. ముందస్తు



బెయిల్ దశలోనే ట్రయల్ పూర్తి చేసినట్లు ఉందని వ్యాఖ్యానించింది. నిర్వహించిన ప్రతి సదస్సులో 350 మంది హాజరయ్యారని చూపారు.. ఇదెలా సాధ్యం అని ప్రశ్నించింది. అన్ని సదస్సుల్లో ఒకరు ఎక్కువ ఒకరు తక్కువ లేకుండా ఎలా ఉంటారని విస్మయం వ్యక్తం చేసింది. ముఖ్యమైన పదవుల్లో ఉన్న అధికారులు.. అన్ని చూసుకోవాలి గానీ, ఇష్టానుసారం చేస్తే ఎలా అని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది.

*** రూ.2 కోట్లకు పైగా నిధులు దుర్వినియోగం**

'అగ్నిమాపక శాఖలో నిరభ్యంతర పత్రాలు (ఎన్వోసీలు) ఆన్‌లైన్‌లో జారీచేసేందుకు అగ్ని ఎన్వోసీ వెబ్‌సైట్, మొబైల్ యాప్ అభివృద్ధి, నిర్వహణ, 150 ట్యాబ్‌ల సరఫరా కాంట్రాక్టును సౌత్రికా టెక్నాలజీస్ అండ్ ఇన్‌ఫ్రా సంస్థకు సంజయ్ అప్పగించారు. ఎలాంటి పనులూ జరగకపోయినా ఆ సంస్థకు రూ.59.93 లక్షల బిల్లులు చెల్లించేశారు. సీఐడీ తరఫున ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ నిరోధక చట్టంపై దళితులు, గిరిజనులకు అవగాహన సదస్సుల నిర్వహణ కాంట్రాక్టును క్రిత్వ్యాప్ టెక్నాలజీస్‌కు ఇచ్చి, రూ.1.19 కోట్లు చెల్లించారు. సదస్సులు మొత్తం సీఐడీ అధికారులే నిర్వహించారు. క్రిత్వ్యాప్ సంస్థ అసలు సదస్సులే నిర్వహించకపోయినా బిల్లుల పేరిట దోచేశారు. ఈ మేరకు ప్రభుత్వ ఖజానాకు దాదాపు రూ.2 కోట్ల మేర నష్టం కలిగించారు' అని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ప్రభుత్వానికి రెండు వేర్వేరు నివేదికలు సమర్పించింది. వాటి ఆధారంగా సంజయ్‌పై ఏసీబీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.




## ఏపీ అసెంబ్లీ సమావేశాలకు ముహూర్తం ఖరారు

ఏపీ అసెంబ్లీ సమావేశాలకు ముహూర్తం ఖరారైనట్లు తెలుస్తోంది. వచ్చే నెల (ఆగస్టు) 18వ తేదీ నుంచి పది రోజుల వరకు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని కూటమి ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. ఆగస్టులో అమలు చేయనున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఈ అసెంబ్లీ సమావేశాల్లో చర్చించనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. కొన్ని బిల్లులకు అసెంబ్లీలో ఆమోదం తెలపనున్నారని సమాచారం. అలాగే, అమరావతి రాజధానిపై ప్రత్యేక చర్చ ఉంటుందని తెలుస్తోంది. ఇదిలా ఉంటే.. సీఎం చంద్రబాబు రాష్ట్రంలో పెట్టుబడులే లక్ష్యంగా సింగపూర్‌లో పర్యటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సింగపూర్‌లో నాలుగు రోజుల పర్యటనను విజయవంతంగా పూర్తిచేసుకున్న సీఎం చంద్రబాబు ఏపీకి చేరుకుని ప్రభుత్వ పథకాల అమలు పై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు సమాచారం.

## నెల్లూరు జైలుకు చేరుకున్న.. వైఎస్ జగన్.. మాజీ మంత్రి అనిల్ కీలక వ్యాఖ్యలు

మాజీ సీఎం వైఎస్ జగన్ పర్యటన నేపథ్యంలో నెల్లూరులో టెన్షన్ వాతావరణం నెలకొంది. ఈ క్రమంలోనే పోలీసు శాఖ అప్రమత్తమైంది. వివిధ జిల్లాల నుంచి జనం భారీ సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండటంతో శాంతిభద్రతలకు భంగం వాటిల్లకుండా నెల్లూరు అంతటా భారీగా పోలీసులను మోహరించారు. ఈ నేపథ్యంలోనే వైఎస్ జగన్ కాసేపటి క్రితం నెల్లూరు జిల్లా జైలుకు చేరుకున్నారు. అనంతరం హెలిప్యాడ్ వద్ద వైసీపీ శ్రేణులు అయనకు ఘన స్వాగతం పలికాయి. అక్కడ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డితో ములాఖత్ కానున్నారు. ఆ తర్వాత నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఇంటిని పరిశీలించనున్నారు. అయితే, జగన్ పర్యటన సందర్భంగా వైసీపీ నేతలు ఎవరూ జనసమీకరణ చేయకూడదని పోలీసులు ఆదేశాలు జారీ చేశారు. హెలిప్యాడ్‌కు వద్దకు కేవలం 10 మందిని మాత్రమే అనుమతించారు. ఇక ప్రసన్న కుమార్ నివాసం వద్దకు 100 మందికి మాత్రమే పర్మిషన్ ఇచ్చారు. ఈ క్రమంలోనే వైసీపీ కీలక నేత, మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ కూటమి ప్రభుత్వంపై సంచలన ఆరోపణలు చేశారు. అక్రమ కేసులతో గత 50 రోజులుగా కాకాణిని జైల్లో పెట్టారని ఆరోపించారు. నేడు జగన్ పర్యటనకు కూడా అడుగడుగునా ఆంక్షలు పెడుతున్నారని ఫైర్ అయ్యారు. వేల మంది పోలీసులను పెట్టి ప్రజలను రాకుండా



అడ్డుకుంటున్నాని పేర్కొన్నారు. తమపై పెట్టినవి తప్పుడు కేసులని పిల్లలకు కూడా తెలుసని కామెంట్ చేశారు. అక్రమ కేసులను పెట్టేందుకు మాత్రమే పోలీసులను వాడుకుంటున్నారని ధ్వజమెత్తారు.

# ఇది పామ్‌పామ్ చామంతి!



**ఆకర్షణీయమైన ఆకృతి, కంటికింపైన రంగులతో ఆకట్టుకునే చామంతులంటే ఎవరికి ఇష్టముండదు? అందులోనూ గుండ్రని బంతుల్లా కనువిందు చేసే పామ్ పామ్ క్రిసాంతిమమ్ అంటే మరీనూ. వీటిని ఎలా పెంచుకోవాలో తెలుసా..!**







పువ్వు రూపాన్ని బట్టి ఈ చామంతికి పామ్ పామ్ క్రిసాంతిమమ్ అనే పేరు వచ్చింది. దొంతరలా గుండ్రంగా పేరుకున్న రేకలతో పామ్‌పామ్‌లా కనిపిస్తాయీ పూలు. ఇవి మామూలుగా ఇతర చామంతుల కంటే కాస్త చిన్నగా ఉంటాయి. వీటిల్లో కుషన్ మమ్స్, బటన్ మమ్స్... ఇలా ఎన్నోరకాలు ప్రాచుర్యంలో ఉన్నాయి. ఆస్టరేసీ కుటుంబానికి చెందిన ఇవి 13 అడుగుల పొదవులో పెరుగుతాయి. ఇవి తెలుపు, పసుపు, గులాబీ, ఎరుపు, ఊదా సహా అనేక రంగుల్లో విరుస్తాయి. మంచి సువాసననూ ఇస్తాయి.



### చక్కగా ఎదగాలంటే...

ఈ పూలు ఆసియాలోని పలు దేశాల్లో విరివిగా కనిపిస్తాయి. ముఖ్యంగా చైనా, జపాన్ దేశాల్లో శతాబ్దాలుగా సాగు చేస్తున్నారు. ఔషధ, అలంకరణ మొక్కలుగా విశేష ప్రాచుర్యం పొందాయి. ఇవి చక్కగా ఎదగాలంటే... రోజుకి కనీసం 5-6 గంటల పాటు ఎండ, తేమ ఎక్కువగా ఉండే నేల అవసరం. బంకమట్టి లేదా ఇసుక నేలల్లో నాటుకోవచ్చు. మట్టిలో కంపోస్ట్ కలిపితే ఆరోగ్యంగా ఎదుగుతాయి. నీళ్లు మరీ ఎక్కువైతే మాత్రం... వేళ్లు కుళ్లిపోయే ప్రమాదం ఉంది. ఆకుల్నీ తడపకూడదు. ఇక, పూలు ఎక్కువగా రావాలంటే... పొటాషియం శాతం ఎక్కువగా ఉండే ఎన్‌పీకేను ఎరువుగా ఇవ్వాలి. మొగ్గలు మొదలయ్యే వరకూ చిగుళ్లను తుంచేస్తే ఎక్కువ కొమ్మలు వస్తాయి.

### గాలి వీచే చోట...

దీనికి బూజు తెగులు ఎక్కువగా వస్తుంది. అందుకే, గాలి బాగా వీచే చోట వీటిని నాటుకోవాలి. ఎండిన, వ్యాధిసోకిన కొమ్మల్ని, ఆకుల్ని ఎప్పటికప్పుడు కత్తిరించాలి. మొక్క చుట్టూ ఉన్న మట్టి మరీ బిగుసుకుపోకుండా వదులు చేయాలి. పండిన కూరగాయలు, పండ్లు వంటివి ఎరువుగా వేయొద్దు. ఎందుకంటే అవి ఉత్పత్తి చేసే ఇథలీన్... పూల జీవితకాలాన్ని తగ్గిస్తుంది.

# టొమాటోకు బదులుగా..!

**కూరల్లో రుచి, గ్రేవీ కోసం టొమాటో వాడడం మనకు అలవాటే! అయితే ఇవి సమయానికి అందుబాటులో లేకపోతే ఇబ్బంది పడాల్సిన అవసరం లేదు.. వీటికి కొన్ని ప్రత్యామ్నాయాలను ప్రయత్నించవచ్చంటున్నారు నిపుణులు.**



* కొన్ని వంటకాల్లో పులుపుదనం కోసం టొమాటోల్ని వాడుతుంటారు. ఇలాంటప్పుడు కొద్దిగా చింతపండు లేదంటే దాని గుజ్జు వేసినా.. ఆ వంటకానికి పులుపుదనం రావడంతో పాటు రుచి తగ్గకుండా జాగ్రత్తపడచ్చు. అలాగే కూర చిక్కదనం కూడా పెరుగుతుంది.
* కూర చిక్కదనం కోసం టొమాటోకు ప్రత్యామ్నాయంగా ఉల్లిపాయల్ని కూడా ఉపయోగించచ్చు. ఈ క్రమంలో ఉల్లిపాయల్ని దోరగా వేయించి పేస్ట్‌లా మిక్సీ పట్టుకొని కూరల్లో వాడుకోవచ్చు. అయితే అది కూడా తక్కువగా వాడితేనే కూర ఘాటుగా ఉండకుండా, దాని రుచి మారిపోకుండా జాగ్రత్తపడచ్చు.
* ఉసిరి పొడి, ఆమ్‌చూర్ పౌడర్.. వంటివి కూడా కూరలకు రుచిని అందించడంతో పాటు.. పులుపుదనాన్నిస్తాయి. కాబట్టి కర్రీ వండేటప్పుడు వీటిలో ఏదో ఒక పొడిని చిటికెడు వేస్తే.. తింటున్నప్పుడు టొమాటో వాడలేదన్న వెలితి ఉండదు.
* కొంతమంది పచ్చిమామిడితో ఒరుగులు, చిప్స్, ఫ్లేక్స్.. వంటివి తయారుచేసుకొని నిల్వ చేసుకుంటారు. వీటినీ కూరల్లో వేసుకొని టొమాటో రుచిని భర్తీ చేయచ్చు.
* కూరల్లో గ్రేవీ కోసం చాలామంది టొమాటోల్ని వాడుతుంటారు. అయితే దీనికి బదులు గుమ్మడి కాయ ప్యూరీ కూడా ఉపయోగించవచ్చంటున్నారు నిపుణులు. టొమాటోలాగే కాస్త తియ్యగా ఉండే ఇది కూరల రుచిని పెంచుతుందనడంలో సందేహమే లేదు.
* టొమాటోలను ఒరుగులు, పొడి రూపంలో నిల్వ చేసుకోవచ్చు. అలాగే ఉడికించిన టొమాటో గుజ్జులో సరిపడా ఉప్పు వేసి ఫ్రిజ్‌లో నిల్వ చేయచ్చు. టొమాటోలు సమయానికి అందుబాటులో లేనప్పుడు కూరల్లో వీటిని వాడచ్చు.
* అలాగే కొన్ని రకాల స్నాక్స్, సలాడ్స్లో టొమాటోకు బదులుగా.. కెచప్‌ని సైతం ఉపయోగించి.. దాని రుచిని ఆస్వాదించచ్చు.









**మధుమేహం ఉన్నవారితో పాటు, అధిక బరువు తగ్గాలనుకునే కొంతమంది చక్కెరకు బదులుగా కృత్రిమ తీపి పదార్థాలను తీసుకుంటుంటారు. అయితే ఇది ఆరోగ్యానికి అంత మంచిది కాదంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో కృత్రిమ తీపి పదార్థాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొన్ని ఆహార పదార్థాల్లాగే కృత్రిమ తీపి పదార్థాలు కూడా అందరికీ పడకపోవచ్చు. కొంతమందిలో వీటిని తీసుకోవడం ద్వారా కడుపుబ్బరం, జీర్ణ సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి వీలైనంతవరకు వీటికి దూరంగా ఉండడమే మంచిదంటున్నారు.**

# అందుకే.. వీటికి దూరంగా..!

### క్యాలరీల విషయంలో..

కృత్రిమ తీపి పదార్థాల్లో క్యాలరీలు తక్కువగా ఉంటాయి. కొన్ని పదార్థాల్లో అయితే అసలు క్యాలరీలే ఉండవు. అందుకే కొంతమంది తమ ఫిట్‌నెస్ కాపాడుకోవడానికి, బరువు తగ్గడానికి ప్రయత్నించే వారు కూడా కృత్రిమ తీపి పదార్థాలను తమ ఆహారంలో భాగం చేసుకుంటారు. అయితే ఆరోగ్యకరమైన బరువు ఉండాలంటే శరీరానికి అవసరమైన నిర్ణీత క్యాలరీల విషయంలో రాజీ పడకూడదంటున్నారు నిపుణులు.

### సహజసిద్ధమైనవే..!

కృత్రిమ తీపి పదార్థాలు సహజసిద్ధంగా లభించే పదార్థాలను ఎప్పటికీ భర్తీ చేయలేవు. కాబట్టి తక్కువ క్యాలరీలు ఉన్న తీపి పదార్థాల కోసం సహజంగా లభించే పదార్థాలను ఉపయోగించడమే మంచిదంటున్నారు నిపుణులు. వీటిని తీసుకోవడం వల్ల కేవలం రుచి మాత్రమే కాకుండా ఆరోగ్య ప్రయోజనాలను కూడా పొందే అవకాశం ఉంటుంది.

### నిపుణులను సంప్రదించాలి..

అలాగే ప్రత్యేకించి మధుమేహ రోగులు కృత్రిమ తీపి పదార్థాలను వాడే విషయంలో సంబంధిత వైద్య నిపుణులను సంప్రదించడం మంచిది.



ట్రంప్ సుంకాలు.. రెండో సెషన్‌లో నష్టాల్లో

# ముగిసిన స్టాక్ మార్కెట్లు..!



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండోసెషన్‌లో నష్టాల్లో ముగిశాయి. నిఫ్టీ 24,800 పాయింట్ల కంటే దిగువన ముగిసింది. సెన్సెక్స్ 296 పాయింట్లకుపైగా పతనమైంది. ట్రంప్ సుంకాల నేపథ్యంలో మార్కెట్లు నష్టాల్లో ట్రేడయ్యాయి. ఆగస్టు ఒకటి నుంచి భారత్ నుంచి వచ్చే అన్ని వస్తువులపై 25శాతం సుంకాలు విధించనున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. రష్యా నుంచి చమురు కొనుగోలు, సైనిక ఆయుధాలను కొనుగోలు చేయడంపై ట్రంప్ సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గురువారం ఉదయం మార్కెట్లు నష్టాల్లో మొదలయ్యాయి. ఏ దశలోనూ సూచీలు మళ్లీ కోలుకోలేదు.

ఉదయం 80,695.50 పాయింట్ల వద్ద నష్టాల్లో మొదలైన సెన్సెక్స్.. ఇంట్రాడేలో 81,803.27 పాయింట్ల గరిష్టానికి చేరుకొని.. అత్యల్పంగా 80,695.15 పాయింట్లకు పడిపోయింది. చివరకు 296.28 పాయింట్లు నష్టపోయి.. 81,185.58 వద్ద ముగిసింది. నిఫ్టీ 86.70 పాయింట్లు తగ్గి.. 24,768.35 పాయింట్లు వద్ద కొనసాగుతున్నది. దాదాపు 1,490 షేర్లు లాభపడగా.. 2,365 షేర్లు పతనమయ్యాయి. హెచ్‌యూఎల్, జియో ఫైనాన్షియల్, ఎటర్నల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఐటీసీ నిఫ్టీలో లాభాలను ఆర్జించాయి. అయితే, నష్టపోయిన వాటిలో అదానీ ఎంటర్‌ప్రైజెస్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, అదానీ పోర్ట్స్, టాటా స్టీల్, సన్ ఫార్మా ఉన్నాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఒక్కొక్కటి 0.7 శాతం తగ్గాయి. ఎఫ్ఎంసీజీ 1.4శాతం పెరగ్గా.. ఐటీ, మెటల్ 1.4 శాతం పెరగ్గా.. ఐటీ, మెటల్, ఆయిల్ అండ్ గ్యాస్, పీఎస్‌యూ బ్యాంక్, ఫార్మా, రియాల్టీ, టెలికాం 0.5-1.8 శాతం వరకు పతనమయ్యాయి.

## దిగి వస్తున్న బంగారం, వెండి ధరలు..



**న్యూఢిల్లీ:** పసిడి ధరలు కొనుగోలుదారులకు ఊరటనిచ్చాయి. రూపాయి బలపడడంతో పుత్తడి ధరలు దిగివచ్చాయి. దేశ రాజధాని ఢిల్లీ నగరంలో 24 క్యారెట్ల బంగారంపై రూ.500 తగ్గి తులానికి రూ.98,520కి చేరింది. 22 క్యారెట్ల బంగారంపై రూ.400 తగ్గి తులానికి రూ.97,800కి పనతమైందని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. బంగారం బాటలోనే వెండి ధర సైతం భారీగానే పతనమైంది. రూ.2వేలు తగ్గి కిలోకు రూ.1.12 లక్షలకు చేరుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై 25శాతం సుంకాలు విధించిన ప్రపంచ మార్కెట్‌లో రూపాయి బలపడడం విశేషం. డాలర్‌తో పోలిస్తే 22 పైసలు బలపడి 87.58 వద్ద ముగిసింది. ఆగస్టు 1 గడువుకు ముందు వాణిజ్య ఒప్పందం కుదరకపోతే భారత వస్తువులపై 25 శాతం సుంకం విధిస్తామని అమెరికా ప్రకటించిన తర్వాత బుధవారం రూపాయి 87.80 వద్ద ముగిసిన విషయం తెలిసిందే. హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ విశ్లేషకుడు (కమోడిటీస్) సౌమిల్ గాంధీ బంగారం ధరలు తగ్గాయని తెలిపారు. సానుకూల యూఎస్ స్థూల ఆర్థిక డేటా కారణంగా డాలర్ బలపడడంతో బులియన్ మార్కెట్‌పై ఒత్తిడిని పెంచిందన్నారు. తాజా జీడీపీ డేటా రెండో త్రైమాసికంలో యూఎస్ ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందిందని సూచిస్తుందని తెలిపారు. ఎల్‌కేపీ సెక్యూరిటీస్ వైస్ ప్రెసిడెంట్ రీసెర్చ్ అనలిస్ట్ (కమోడిటీ అండ్ కరెన్సీ) జతిన్ త్రివేది మాట్లాడుతూ బంగారం ధరలు హెచ్చుతగ్గులకు గురవుతున్నాయన్నారు. సుంకాల ఆందోళన ల మధ్య సమీప భవిష్యత్తులో వడ్డీ రేట్లను తగ్గిస్తామని ఫెడ్ రిజర్వ్ ఎలాంటి సూచనలు ఇవ్వలేదన్నారు. ప్రపంచ మార్కెట్లలో బంగారం ధరలు పెరిగాయి. స్పాట్ బంగారం 0.89 శాతం పెరిగి ఔన్సుకు 3,304.14 డాలర్లకు చేరాయి. విదేశీ మార్కెట్‌లో స్పాట్ సిల్వర్ ఔన్స్‌కు 2.22 శాతం తగ్గి 36.30కి చేరుకుంది. పెట్టుబడిదారులు ద్రవ్య విధానం, వ్యక్తిగత వినియోగ వ్యయం సూచిక, నిరుద్యోగ డేటా, యూఎస్ స్థూల ఆర్థిక డేటాను నిశితంగా పరిశీలిస్తారని కోటక్ సెక్యూరిటీస్‌లోని కమోడిటీ రీసెర్చ్ ఏవీపీ కైనత్ చైన్వాలా చెప్పారు.

## ఆరు భారతీయ చమురు కంపెనీలపై అమెరికా ఆంక్షలు




**వాషింగ్టన్:** సుంకాలు, జరిమానాలతో భారత్‌పై విరుకుపడుతున్న డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం.. ఆరు భారతీయ ఆయిల్ కంపెనీలకు షాకిచ్చింది. ఇరాన్ పెట్రోలియం, పెట్రోకెమికల్ ఉత్పత్తులను మార్కెటింగ్ చేస్తున్నారన్న ఆరోపణలతో మన చమురు కంపెనీలపై ఆంక్షలు విధించింది. ఈ మేరకు ఆ దేశ విదేశాంగ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. చమురుతో నిధులు సమకూర్చుకొని మధ్య ప్రాచ్యంలో సంఘర్షణలకు ఇరాన్ ఆజ్యం పోస్తున్నదని అందులో పేర్కొంది. ఈ నేపథ్యంలో టెహ్రాన్ ఆదాయన వనరులను అడ్డుకునేందుకు చర్యలు తీసుకున్నట్లు వెల్లడించింది.

ఈ జాబితాలో కాంచన్ పాలిమర్స్, అల్‌కెమికల్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, రామ్నిక్‌లాల్ ఎస్ గోసాలియా అండ్ కంపెనీ, జూపిటర్ డై కెమ్ ప్రైవేట్ లిమిటెడ్, గ్లోబల్ ఇండస్ట్రియల్ కెమికల్స్ లిమిటెడ్, పెర్సిస్టెంట్ పెట్రోకెమ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు ఉన్నాయి. వీటితోపాటు టర్కీ, యూఏఈ, చైనా, ఇండోనేషియాలోని పలు సంస్థలపై కూడా అమెరికా ఆంక్షలు విధించింది. 2024, జనవరి నుంచి 2025 జనవరి మధ్య ఆయా సంస్థలు ఇరాన్ నుంచి మిథనాల్, టోలున్, పాలీథైలిన్ వంటి పదార్థాలను దిగుమతి చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. భారత్‌కు చెందిన చమురు కంపెనీలు పదుల మిలియన్ల అమెరికన్ డాలర్ల విలువ చేసే దిగుమతి చేసుకున్నాయని యూఎస్ విదేశాంగ శాఖ వెల్లడించింది.

# బ్యాటింగ్‌లో తడబడ్డ భారత్



**ఓవల్:** ఇంగ్లండ్‌తో సిరీస్‌ను 2-2తో సమం చేయాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో భారత జట్టు తొలి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేస్తూ తడబాటుకు గురైంది. టాస్ గెలిచి పరిస్థితులను తమకు అనుకూలంగా మలుచుకున్న ఇంగ్లండ్ పేసర్లు కట్టడిచేయడంతో టీమ్‌ఇండియా ప్రధాన బ్యాటర్లంతా పెవిలియన్‌కు క్యూ కట్టారు. పలుమార్లు వర్షం అంతరాయం కల్గించిన మ్యాచ్‌లో 64 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. మొదట బ్యాటింగ్ చేసిన భారత్.. తొలిరోజు ఆట ముగిసే సమయానికి 6 వికెట్ల నష్టానికి 204 పరుగులు చేసింది. కరుణ్ నాయర్ (98 బంతుల్లో 52 నాటౌట్, 7 ఫోర్లు) అర్ధ శతకంతో రాణించగా సాయి సుదర్శన్ (108 బంతుల్లో 38, 6 ఫోర్లు) భారత్‌ను ఆదుకున్నారు. ఇంగ్లండ్ బౌలర్లలో గస్ అట్కిన్సన్ (2/31) జోష్ టంగ్ (2/47) తలా రెండు వికెట్లు తీయగా వోక్స్ ఒక వికెట్ తీశాడు.

ఇంగ్లండ్ ఆహ్వానం మేరకు మొదట బ్యాటింగ్‌కు వచ్చిన భారత్.. తొలి సెషన్ నుంచే ఇబ్బందులు ఎదుర్కొంది. పిచ్‌పై ఉన్న పచ్చికతో పాటు మబ్బులు పట్టి ఉన్న వాతావరణాన్ని వినియోగించుకుంటూ ఇంగ్లిష్ పేసర్లు కట్టుదిట్టమైన బంతులేయడంతో భారత్‌కు పరుగుల రాక గగనమైంది. అట్కిన్సన్ వేసిన ఇన్నింగ్స్ నాలుగో ఓవర్లో బంతిని తప్పుగా అంచనా వేసిన జైస్వాల్ (2) వికెట్ల ముందు దొరికిపోయాడు. మూడో స్థానంలో వచ్చిన సాయితో కలిసి రాహుల్ (14).. ఆచితూచి ఆడాడు. అయితే డ్రింక్స్ విరామం తర్వాత వోక్స్ ఓవర్లో రాహుల్.. బంతిని కట్ చేయబోయి వికెట్ల మీదకు ఆడుకోవడంతో అతడి ఇన్నింగ్స్ ముగిసింది. ఈ క్రమంలో సాయితో జతకలిసిన గిల్(21)%?% భారత ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే యత్నం చేశాడు. లంచ్ విరామానికి రెండు ఓవర్ల ముందు ఓవల్‌ను వర్షం ముంచెత్తింది. కొద్దిసేపటి తర్వాత వాన ఆగినా ఔట్‌ఫీల్డ్ తడిగా ఉండటంతో సుమారు రెండు గంటల పాటు ఆట నిలిచిపోయింది.

విరామం తర్వాత తిరిగి ప్రారంభమైన ఆటలో భారత్‌కు అట్కిన్సన్ మరో షాకిచ్చాడు. అతడు వేసిన 28వ ఓవర్లో రెండో బంతిని గిల్ ఫార్వర్డ్ షార్ట్ లెగ్ దిశగా ఆడాడు. నాన్ స్ట్రైకర్ ఎండ్‌లో సాయి వద్దని వారించినా గిల్ సింగిల్ తీసేందుకు యత్నించి దాదాపు సగం క్రీజు దాకా వచ్చి మళ్లీ వెనక్కి వెళ్లబోయాడు. కానీ అప్పటికే బంతినందుకున్న అట్కిన్సన్.. నేరుగా వికెట్లను గురిచూసి కొట్టడంతో భారత సారథి నిరాశగా వెనుదిరిగాడు. గిల్ ఔటైన తర్వాత పది బంతులకే మళ్లీ వర్షం ప్రారంభమైంది.

టీ తర్వాత ఆట పున:ప్రారంభమవగా శార్దూల్ స్థానంలో జట్టులోకి వచ్చిన కరుణ్ నాయర్ కీలక ఇన్నింగ్స్ ఆడాడు. మొదట సాయితో కలిసి ఇంగ్లండ్ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్న అతడు.. వాషింగ్టన్ (19 నాటౌట్)తో అజేయమైన ఆరో వికెట్‌కు 51 పరుగులు జోడించాడు. క్రీజులో కుదురుకుని అర్ధ శతకం దిశగా సాగుతున్న సాయి.. టంగ్ 36వ ఓవర్లో కీపర్ స్మిత్‌కు క్యాచ్ ఇవ్వడంతో భారత్ నాలుగో వికెట్ కోల్పోయింది. భారత్ భారీ ఆశలు పెట్టుకున్న రవీంద్ర జడేజా (9) సైతం టంగ్ ఓవర్లో సాయి మాదిరిగానే కీపర్‌కు క్యాచ్ ఇవ్వడంతో భారత్ కష్టాలు రెట్టింపయ్యాయి. ఈ సిరీస్‌లో తొలి మ్యాచ్ ఆడుతున్న ధ్రువ్ జురెల్ (19) కూడా వారిబాటే పట్టాడు. ఈ క్రమంలో మాంచెస్టర్ సెంచరీ హీరో వాషింగ్టన్, కరుణ్.. వికెట్ల పతనానికి అడ్డుకట్ట వేసి రోజును ముగించారు.

కెప్టెన్‌గా తన తొలి టెస్టు సిరీస్‌లోనే గిల్ దిగ్గజాల సరసన నిలిచాడు. ఈ సిరీస్‌లో టాప్ స్కోరర్‌గా ఉన్న భారత సారథి (743).. ఐదో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో 11 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఒక టెస్టు సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన భారత సారథిగా నిలిచాడు. గతంలో ఈ రికార్డు సునీల్ గవాస్కర్ (1978/79లో వెస్టిండీస్‌తో 732 రన్స్) పేరిట ఉండేది. ఈ జాబితాలో విరాట్ కోహ్లీ (2016/17లో ఇంగ్లండ్ పై 655) మూడో స్థానంలో ఉన్నాడు.

## లార్డ్స్ టెస్టులో బాల్ ఛేంజ్ వివాదం

ఐసీసీకి ఫిర్యాదు చేసిన టీమిండియా!




**లార్డ్స్:** ఇండియా, ఇంగ్లండ్ మధ్య జరుగుతున్న టెస్టు సిరీస్‌లో ఇవాళ్టి నుంచి అయిదో టెస్టు జరగనున్న విషయం తెలిసిందే. అయితే లార్డ్స్‌లో జరిగిన కీలకమైన మూడవ టెస్టులో వివాదస్పద ఘటన చోటుచేసుకున్నది. బంతిని మార్చే అంశంలో వివాదం చెలరేగినట్లు టీమిండియా ఆరోపించింది. ఈ నేపథ్యంలో ఐసీసీకి ఫిర్యాదు కూడా చేసింది. ఆ టెస్టు మ్యాచ్‌లో ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్ ఆడుతున్న సమయంలో.. పది ఓవర్లకే బంతి షేప్ మారింది. ఆకారం చెడి పోవడంతో మరో బంతి తీసుకోవాల్సి వచ్చింది. అయితే రీప్లేస్‌మెంట్‌లో భాగంగా అంతే పాత బంతిని అంపైర్లు ఇవ్వాలి. కానీ ఇక్కడ తప్పు జరిగినట్లు టీమిండియా క్రికెటర్లు ఆరోపిస్తున్నారు.

పది ఓవర్ల బంతి స్థానంలో 35 ఓవర్లు ఆడిన పాత బంతిని ఇచ్చినట్లు పేర్కొన్నారు. బంతి మరీ పాతది కావడం వల్ల.. రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ బ్యాటర్లను ఈజీగా ఔట్ చేయలేకపోయారు. అప్పటి వరకు ఆధిపత్యం చాటిన ఇండియా.. 35 ఓవర్లు ఆడిన బంతిని తీసుకోవడం వల్ల స్మిత్‌ను ఈజీగా ఔట్ చేయలేకపోయింది. దీంతో అతను చెలరేగిపోయాడు.

వాస్తవానికి 10 ఓవర్లకు చెడిన బంతి స్థానంలో.. అంతే పాత బంతిని ఇవ్వాలి. కానీ టీమిండియా అభ్యర్థనను ఇంగ్లండ్ పట్టించుకోలేదని తెలుస్తోంది. రెండో బంతి తీసుకున్న తర్వాత స్వింగ్ లేకపోవడం వల్ల.. ఓ దశలో 10 ఓవర్లు వాడిన బంతినే ఇవ్వాలని అడిగారు. కానీ ఐసీసీ రూల్స్ ప్రకారం ఆ రిక్వెస్ట్ వర్కౌట్ కాలేదు.

పది ఓవర్లు ఆడిన బంతి సగటున 1.869 డిగ్రీల స్వింగ్, 0.579 డిగ్రీల సీమ్ మూమెంట్ ఇస్తోంది. కానీ రిప్లేస్మెంట్ బంతి కేవలం 0.855 డిగ్రీల స్వింగ్ మాత్రమే ఇచ్చినట్లు టీమిండియా ఫిర్యాదు చేసింది. ఆ మ్యాచ్‌లో ఇంగ్లండ్ 22 రన్స్ తేడాతో నెగ్గిన విషయం తెలిసిందే. దాంతో సిరీస్‌లో 2-1 తేడాతో ఆధిక్యాన్ని సాధించింది. ఇక నాలుగవ టెస్టు డ్రా అయ్యింది.

## స్వియాటెక్ ముందంజ



**మాంట్రియాల్ (కెనడా):** ఇటీవలే ముగిసిన వింబుల్డన్‌లో మహిళల సింగిల్స్ గెలిచిన జోష్‌లో ఉన్న పోలండ్ బామ ఇగా స్వియాటెక్.. యూఎస్ ఓపెన్‌కు ముందు జరుగుతున్న మాంట్రియాల్ ఓపెన్‌లో శుభారంభం చేసింది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో స్వియాటెక్.. 6-3, 6-1తో హన్యు (చైనా)పై అలవోక విజయం సాధించింది. వింబుల్డన్ రన్నరప్ అనిసిమొవ, ఎమ్మా రడుకాను, బెలిందా బెన్‌కిక్, జెస్సిక పెగులా, రిబాకినా సైతం తదుపరి రౌండ్‌కు చేరారు.

## నాలుగు వేదికల్లో ప్రో కబడ్డీ లీగ్

ఏడేండ్ల తర్వాత వైజాగ్ ఆతిథ్యం




**న్యూఢిల్లీ:** ప్రో కబడ్డీ లీగ్ (పీకేఎల్) 12వ సీజన్ షెడ్యూల్ వచ్చేసింది. ఆగస్టు 29 నుంచి అక్టోబర్ 23 దాకా (లీగ్ దశ) జరుగబోయే ఈ మెగా ఈవెంట్ దేశవ్యాప్తంగా నాలుగు నగరాల్లో అభిమానులకు కబడ్డీ మజాను అందించనుంది. ఈ మేరకు పీకేఎల్ నిర్వాహకులు షెడ్యూల్‌ను విడుదల చేశారు. విశాఖపట్నం, జైపూర్, చెన్నై, ఢిల్లీ వేదికలుగా ఈ టోర్నీ జరుగనుంది. ఏడేండ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఈ టోర్నీకి వైజాగ్ ఆతిథ్యమివ్వనుంది.



వైజాగ్‌లో ఆగస్టు 29 నుంచి సెప్టెంబర్ 11 వరకు, జైపూర్‌లో సెప్టెంబర్ 12 నుంచి 28 దాకా, చెన్నైలో సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 12 వరకు జరుగనున్న ఈ టోర్నీ.. ఢిల్లీలో అక్టోబర్ 13 నుంచి 23 దాకా జరుగుతుంది. ప్లేఆఫ్స్‌కు సంబంధించిన షెడ్యూల్‌ను త్వరలో వెల్లడించనున్నారు. ఇక ఆగస్టు 29న తెలుగు టైటాన్స్.. తమిళ్ తలైవాస్‌తో టోర్నీ అధికారికంగా ప్రారంభమవనుంది. డిఫెండింగ్ చాంపియన్స్ హర్యానా స్టీలర్స్.. ఆగస్టు 31న బెంగాల్ వారియర్స్ మ్యాచ్‌తో టైటిల్ వేటను మొదలుపెట్టనున్నారు.

## ప్రేక్షకులను ఆకట్టుకునేలా కింగ్డమ్ మూవీ

### విజయ్ అభిమానులకు పండగలాంటి సినిమా



**టాకీస్:** విజయ్ దేవరకొండ సినిమా వస్తుందంటే యువతలో అమితాసక్తి నెలకొంటుంది. వరుస సినిమాలు చేస్తున్నా, బాక్సాఫీస్ వద్ద మేజిక్ క్రియేట్ చేయడంలో తడబడుతున్నారు. ఈ నేపథ్యంలో గౌతమ్ తిన్ననూరితో కలిసి ఆయన చేసిన తాజా చిత్రం 'కింగ్డమ్' గురువారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇక కథలోకి వెళితే...సూరి (విజయ్ దేవరకొండ) ఓ కానిస్టేబుల్. చిన్న వయసులోనే కుటుంబానికి దూరమైన తన అన్న శివ (సత్యదేవ్) జాడ కోసం వెతుకుతుంటాడు. ఆ ప్రయత్నంలో ఉండగానే పోలీస్ అధికారులకీ సూరికి మధ్య గొడవ జరుగుతుంది. అది తన పై అధికారుల వరకూ వెళ్తుంది. అందుకు సంబంధించి విచారణ జరుగుతున్నప్పుడు ఊహించని రీతిలో సూరికి ఓ మిషన్ బాధ్యతల్ని అప్పజెబుతారు. సూరి వెతుకుతున్న తన అన్న శివ ఆచూకీ శ్రీలంక సమీపంలోని దివి అనే ఓ ద్వీపంలో ఉందని, గూఢచారిగా అక్కడ పనిచేయాలని చెబుతారు. తన అన్న కోసం ఎంత దూరమైనా వెళ్లడానికి సిద్ధమైన సూరి... పై అధికారి చెప్పినట్టే శ్రీలంకలో అడుగు పెడతాడు. అత్యంత ప్రమాదకరమైన స్మగ్లింగ్ కార్టెల్ అదుపాజ్ఞల్లో ఉన్న దివిలోకి సూరి ఎలా అడుగు పెట్టాడు?ఇంతకీ శివ ఆ దివికి ఎందుకు వెళ్లాడు? ఆ ద్వీపంలో ఉన్న తెగకీ, శివకీ సంబంధం ఏమిటి? అక్కడి తెగ 70ఏళ్లుగా ఎవరి రాకకోసం ఎదురు చూస్తూ ఉ ంటుంది? తన అన్నతో కలిసి సూరి తిరిగొచ్చాడా?అన్నది చిత్ర కథ. అన్నదమ్ముల చుట్టూ తిరిగే గ్యాంగ్‌స్టర్ డ్రామా ఇది. తెలుగులో ఇలాంటి కథలు కొత్తేమీ కాదు కానీ, మిగతావాటితో పోలిస్తే దీనిలో అన్నదమ్ముల బంధం, ద్వీపంలో చిక్కుకుపోయిన ఓ తెగ నేపథ్యమే 'కింగ్డమ్'ను భిన్నంగా నిలుపుతుంది. గ్యాంగ్‌స్టర్ కథలకి డ్రామా కీలకం. ఆ విషయంలో దర్శకుడు గౌతమ్ తిన్ననూరి రచన బలమైన ప్రభావమే చూపిస్తుంది. డ్రామాతోపాటు కథా ప్రపంచంలో లీనం చేసే విజువల్స్, వాటికి మరింత బలాన్నిచ్చే సంగీతం, తెరపైన పాత్రలు తప్ప నటులే కనిపించని అభినయాలు... ఇలా అన్నీ ఉన్నా ఆ స్థాయిలో భావోద్వేగాలు బలంగా పండించలేకపోయారు. 1920ల నాటి నేపథ్యాన్ని తెరపై ఆవిష్కరిస్తూ కథని ఆసక్తికరంగా మొదలు పెట్టాడు దర్శకుడు. తొలి సన్నివేశంతోనే 'కింగ్డమ్' ప్రపంచంలో లీనమయ్యేలా చేశారు. ఆ తర్వాత కానిస్టేబుల్‌గా సూరి జీవితం, అన్న జాడ కోసం అతను చేసే ప్రయత్నాలు, ఆ తర్వాత మిషన్ బాధ్యతల్ని భుజాన వేసుకునే సన్నివేశాలతో సినిమా వేగంగానే పరుగులు పెడుతుంది. కథ శ్రీలంకకి మారాక జాఫ్నా జైలు నేపథ్యంతో పాటు, సూరి, శివ... తాము అన్నదమ్ములమనే విషయం ఇద్దరికీ ఎప్పుడు తెలుస్తుందనే అంశాలు ప్రేక్షకుల్లో ఆత్రుతని, ఆసక్తిని రేకెత్తిస్తాయి. అడుగడుగునా నాటకీయతతో సన్నివేశాల్ని మలిచినా, కథకు ప్రధానంగా అవసరమైన భావోద్వేగాల్ని ఆవిష్కరించలేకపోయారు. కథ నుంచి పక్కకు వెళ్లకుండా సన్నివేశాల్ని తీర్చిదిద్దడం సినిమాకు కలిసొచ్చింది.



### వార్-2 నుంచి ఊపిరి ఊయలగా

## సాంగ్ విడుదల

**టాకీస్:** బాలీవుడ్ స్టార్ హృతిక్ రోషన్, అలాగే మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ ల కలయికలో.. దర్శకుడు అయాన్ ముఖర్జీ తెరకెక్కించిన, భారీ పాన్ ఇండియా యాక్షన్ చిత్రమే 'వార్ 2'. ఒక క్రేజీ మల్టీస్టారర్‌గా వస్తున్న ఈ మూవి కోసం ఎదురు చూస్తున్న ఫ్యాన్స్ కి ఫైనల్ గా మ్యూజికల్ ట్రీట్ వచ్చేసింది. వార్ 2 నుంచి 'ఊపిరి ఊయలగా' అనే లవ్ సాంగ్ విడుదలైంది. ప్రస్తుతం ఈ సాంగ్ అభిమానుల్లో, యూత్‌లో మంచి క్రేజ్ సంపాదిస్తోంది. హృతిక్ రోషన్ - కియారా అద్వానీ కెమిస్ట్రీక్రి ఇందులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సాఫ్ట్‌గా, ఎమోషన్‌తో నిండిన ఈ ప్రేమ గీతం ఓ ఊహించని టోన్‌ని పరిచయం చేస్తోంది. ఈ పాటకు తెలుగు లిరిక్స్‌ని రాసిన చంద్రబోస్ భావోద్వేగాన్ని అద్భుతంగా పలికించారు. శశ్వత్ సింగ్, నిఖితా గాంధీ వినిపించిన గాత్రం పాటకు మరింత ప్లస్ అయ్యింది. ఇక హృతిక్ స్టైలిష్ లుక్, కియారా స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఈ వీడియో సాంగ్ విజువల్స్, ముఖ్యంగా ఇద్దరి మధ్య కెమిస్ట్రీ కూడా అదిరిపోయింది. ఈ పాట విడుదలతో మూవీపై ఉన్న బజ్ మళ్లీ పీక్స్‌కి చేరింది.




## నచ్చినట్లు డ్రెస్ వేస్తే బోల్డ్‌గా ఉన్నట్లు కాదు..

### అలా ఉంటే విలువలు కోల్పోయినట్లా..?: అనసూయ

టాకీస్: యాంకర్ అనసూయ గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరంలేదు. బుల్లితెరపై కెరీర్ స్టార్ట్ చేసిన ఆమె ఇప్పుడు సినీరంగంలో బిజీ నటిగా మారిపోయింది. రంగస్థలం సినిమాతో నటిగా ప్రశంసలు అందుకుంది. దీంతో టాలీవుడ్ లో బ్యాక్ టూ బ్యాక్ సినిమాలతో అలరిస్తుంది. కానీ సోషల్ మీడియాలో మాత్రం నిత్యం ఏదోక విషయంతో వార్తలలో నిలుస్తుంది. ముఖ్యంగా ఆమ డ్రెస్సింగ్ స్టైల్ పై ఎక్కువగా ట్రోల్స్ వస్తుంటాయి. ఇద్దరు బిడ్డల తల్లి అయినప్పటికీ గ్లామర్ డ్రెస్సులు వేసుకోవడం ఏంటని విమర్శిస్తుంటారు. తాజాగా తనపై వస్తున్న ట్రోల్స్ పై స్పందిస్తూ సుధీర్ఘ పోస్ట్ చేసింది అనసూయ. తల్లి అయ్యాక మనల్ని మనం వదిలేసుకోవాలా ? ప్రశ్నిస్తూ ఓపెన్ లెటర్ షేర్ చేసింది. "నన్ను ఎవరైనా విమర్శించినా చాలా వరకు మౌనంగానే ఉ ంటున్నాను. కానీ నాకు నచ్చినట్లు నేను బతుకుతున్నప్పుడు నా జీవన శైలినే విమర్శిస్తుంటే స్పందించాల్సిన అవసరం ఉంది. సోషల్ మీడియాలో కొంతమంది నన్ను టార్గెట్ చేస్తూ వీడియోస్ చేస్తున్నారు. అందులో ఎక్కువగా మహిళలే నన్ను లక్ష్యంగా చేసుకుంటున్నారు. వారందరూ నాకు తెలియదు. అయినా నన్ను వ్యక్తిగతంగా విమర్శిస్తున్నారు. నేను ఒక మహిళను.. ఇద్దరు పిల్లల తల్లిని. కానీ నా స్టైల్, గ్లామర్, ధైర్యాన్ని వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించే డ్రెస్సులు ధరించడాన్ని నేను ఎంజాయ్ చేస్తాను. ఇలా కనిపించడమే నాకు నచ్చుతుంది. కానీ నేను ఓ తల్లిగా ప్రవర్తించడం లేదని అంటున్నారు. తల్లి అయ్యాక మన నిజమైన స్వరూపాన్ని వదిలేసుకోవాలా ? అని నేను అడుగుతున్నాను.. నా భర్త, పిల్లలు, నా కుటుంబం నేను ఎలా ఉన్నా అంగీకరిస్తారు. ప్రేమిస్తారు. నన్ను సపోర్ట్ చేస్తుంటారు. నాకు అది చాలు .ఇంత ఓపెన్ గా ఉండడం కొంతమందికి కొత్తగా అనిపించవచ్చు. అయినా పర్లేదు. ఒకరి ఛాయిస్ ను చెడుగా ప్రభావంగా చూడకండి. నా పిల్లలు నన్ను గౌవరంతో, బాధ్యత ఉన్న మహిళగానే చూస్తున్నారు. బోల్డ్ గా ఉండడం అంటే అగౌరవంగా ఉండడం కాదు. నాకు నచ్చిన విధంగా డ్రెస్ వేసుకోవడం వల్ల నేను నా విలువలు కోల్పోయానని అర్థం కాదు. నన్ను ఫాలో అవ్వమని నేను అనడం లేదు. ఇదొక్కటే మార్గమని నేను చెప్పడం లేదు. మీకు నచ్చినట్లు మీరు బతికినట్టే.. నా జీవితాన్ని నాకు నచ్చిన స్టైల్లో బతికే హక్కు ఉంది. నేను ప్రేమతో, ధైర్యంగా, స్వేచ్ఛతో బతుకుతున్నాను. అదే సమయంలో ఇతరులను గౌరవించడం మర్చిపోను " అంటూ తన పోస్టులో తెలిపారు.

## నాచారంలో కొత్త మల్టీప్లెక్స్

### లాంఛనంగా ప్రారంభించిన దిల్ రాజు

**టాకీస్:** హైదరాబాద్ సినీ ప్రియులకు గుడ్ న్యూస్. మూవీ లవర్స్‌ని అలరించడానికి మరో కొత్త మల్టీప్లెక్స్ అందుబాటులోకి వచ్చింది. అత్యంత విలాసవంతమైన, అధునాతన సౌకర్యాలతో కూడిన యూకే సినీప్లెక్స్ నాచారంలో ఘనంగా ప్రారంభమైంది. ప్రముఖ నిర్మాతలు దిల్ రాజు, సునీల్ నారంగ్, భరత్ నారంగ్‌లతో పాటు శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా ఈ 4-స్క్రీన్ మల్టీప్లెక్స్‌ను ప్రారంభిం చారు. ఈ సందర్భంగా నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ, యూకే సినీప్లెక్స్ థియేటర్ ఎంతో ఉన్నతంగా ఉందని ప్రశంసించారు. 'సౌండ్ సిస్టమ్, స్క్రీన్, సీట్లు ఎంతో బాగున్నాయి. ఉప్పల్, హబ్సిగూడ, నాచారం ప్రాంతాల్లో నివసించే వారికి ఈ మల్టీప్లెక్స్ వినోదాన్ని పంచడంలో సరికొత్త అనుభూతిని ఇస్తుందనటంలో ఎటువంటి సందేహం లేదని ఆయన అన్నారు. ఈ ప్రారంభోత్సవ వేడుకలో శ్రీమతి పృతికా ఉదయ్, శ్రీ రుషిల్ ఉదయ్‌లతో పాటు- పలువురు రాజకీయ ప్రముఖులు కూడా పాల్గొన్నారు. యూకే సినీప్లెక్స్ కేవలం ఒక సినిమా థియేటర్ మాత్రమే కాదని, ఇది ఒక పూర్తిస్థాయి వినోద అనుభూతి అని నిర్వాహకులు పేర్కొన్నారు. అత్యాధునిక సాంకేతికతతో పాటు-, అత్యుత్తమ సౌకర్యాలు కలిగిన ఈ సినీప్లెక్స్ సినిమా ప్రేమికులకు, కుటుంబాలకు ప్రీమియం అనుభవాన్ని అందించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. ఇక నాచారంలో కొత్తగా ప్రారంభమైన సినీప్లెక్స్ నగరవాసులకు సరికొత్త సినిమా అనుభూతిని అందించబోతుంది. ఈ మల్టీప్లెక్స్ ప్రేక్షకులకు అత్యంత సౌకర్యాన్ని అందించే



మృదువైన సీటింగ్, విలాసవంతమైన వీక్షణ కోసం ప్రీమియం రిక్లైనర్లు, సౌకర్యవంతమైన సోఫాలను ఏర్పాటు చేసింది. సినిమాలోని ప్రతి ధ్వనినీ స్పష్టంగా వినిపిస్తూ, ప్రేక్షకులను సినిమా ప్రపంచంలో లీనం చేసే అట్మాస్ సౌండ్ వ్యవస్థను కలిగి ఉంది. దృశ్యాలను స్పష్టంగా, మెరుగైన నాణ్యతతో చూడటానికి లేజర్ ప్రొజెక్షన్, అద్భుతమైన దృశ్య అనుభవం కోసం సిల్వర్ స్క్రీన్‌లు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. వీటితో పాటు, ప్రేక్షకుల కోసం లైవ్ కౌంటర్లు, పిజ్జాలు, శాండ్‌విచ్‌లు, డెజర్ట్‌లు వంటి రుచికరమైన ఆహారం, పానీయాలు కూడా ఒకే చోట లభించడం యూకే సినీప్లెక్స్ ప్రత్యేకత. నాచారంలో యూకే సినీప్లెక్స్ ప్రారంభం హైదరాబాద్ నగర వినోద రంగానికి ఒక సరికొత్త అధ్యాయాన్ని ప్రారంభించింది.

## 'సైయూరా' సంచలనం

### 13 రోజుల్లో 'ఛావా' రికార్డు బద్దలు!

**టాకీస్:** బాలీవుడ్‌తో పాటు ప్రస్తుతం ఇండియా అంతటా వినిపిస్తున్న పేరు సైయా రా. చిన్న సినిమాగా విడుదలైన ఈ చిత్రం



ఇండియాతో పాటు వరల్డ్ వైడ్‌గా సంచలనాలు సృష్టిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ చిత్రం రూ. 400 కోట్ల వసూళ్లను రాబట్టి విజయవంతంగా దూసుకెళుతుంది. ఇదిలా వుంటే ఈ చిత్రం మరో రికార్డును అందుకుంది. ఓవర్సీస్‌లో ఈ ఏడాది అత్యధిక వసూళ్లు సొంతం చేసుకున్న బాలీవుడ్ సినిమాగా రికార్డు నెలకొల్పిన 'ఛా వా' సినిమా రికార్డును బీట్ చేసింది సైయా రా. ఛావా సినిమా వరల్డ్ వైడ్‌గా రూ.91 కోట్లు వసూళ్లను రాబట్టి.. ఈ ఏడాది టాప్‌లో ఉండగా.. కేవలం 13 రోజుల్లోనే ఈ రికార్డును అధిగమించి రూ.94 కోట్లతో దూసుకుపోతుంది సైయారా. ఈ చిత్రానికి మోహిత్ సూరి దర్శకత్వం వహించగా.. ఆహాన్ పాండే, అనిత్ పడ్డా హీరో హీరోయిన్‌లుగా నటించారు.

## రుణం ఇప్పిస్తానంటూ 5కోట్లకు టోకరా

### తమిళ నటుడు శ్రీనివాసన్ అరెస్ట్



**టాకీస్:** తమిళ సినీ పరిశ్రమలో 'పవర్ స్టార్'గా గుర్తింపు పొందిన ఎస్. శ్రీనివాసన్ మరోసారి వివాదంలో చిక్కుకున్నారు. ఢిల్లీకి చెందిన ఓ సంస్థను రూ.1000 కోట్ల రుణం ఇప్పిస్తానంటూ హామీ ఇస్తూ, అడ్వాన్స్‌గా రూ.5 కోట్లు తీసుకుని మోసం చేసిన ఆరోపణలపై ఆయనను ఢిల్లీ పోలీసులు చెన్నైలో అరెస్ట్ చేశారు. 2010లో 'బ్లూ కోస్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ లిమిటెడ్' అనే సంస్థకు రూ.1000 కోట్లు లోన్ ఇప్పిస్తానని శ్రీనివాసన్ హామీ ఇచ్చాడట. దీనికి బదులుగా.. వారి దగ్గర నుంచి రూ.5 కోట్లు- అడ్వాన్స్‌గా తీసుకున్నాడు. నెల రోజుల్లో లోన్ వస్తుందని రాకపోతే డబ్బులు తిరిగిఇస్తానని హామీ ఇచ్చాడు. అయితే నెల కంటే ఎక్కువ రోజులు గడుస్తున్న లోన్ మంజూరు కాకపోవడంతో మోసపోయామని గుర్తించిన సంస్థ యాజమాన్యం పోలీసులను ఆశ్రయించింది. అయితే ఈ కేసుపై విచారణ చేపట్టిన పోలీసులు.. దర్యాప్తులో భాగంగా రూ. 5 కోట్లు- నేరుగా శ్రీనివాసన్, అతని భార్య బ్యాంకు ఖాతాలకు బదిలీ అయినట్లు- గుర్తించారు. అంతేకాదు ఈ డబ్బుని అతడి వ్యక్తిగత అవసరాల కోసంతో పాటు- సినిమాల నిర్మాణానికి ఉపయోగిం చినట్లు తేలింది. ఇక ఈ కేసులో దర్యాప్తునకు సహకరించకుండా, విచారణకు హాజరుకాకుండా 2018 నుంచి శ్రీనివాసన్ తప్పించుకుని తీరుగుతున్నాడనే ఆరోపణలు కూడా ఉన్నాయి. దీంతో కోర్టు అతడిని నేరస్థుడిగా ప్రకటించింది. అతడు చెన్నైలో ఉ న్నట్లు- తెలవడంతో అతడిని ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకుని తదుపరి విచారణ నిమిత్తం ఢిల్లీకి తరలించారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.